# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 27 మార్చి 2025 | సంపుటి:9 | సంచిక:91 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## శ్రీరామనవమికి పంబన్ బ్రిడ్జి ప్రారంభం

2

## వందేండ్ల ప్రశ్నకు జవాబు చెప్పిన బ్రిలియంట్ గర్ల్

భారత సంతతి అమ్మాయి చేసిన అద్భుతం

2

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై లోతైన విచారణ

### హోం మంత్రి అనిత

**రాజమహేంద్రవరం:** పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై లోతైన విచారణ చేయిస్తున్నామని హోం మంత్రి అనిత తెలిపారు. డీఎస్పీ స్థాయి పోలీసు అధికారుల కమిటీ విచారణ చేస్తోందన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఈ ఘటనపై దర్యాప్తు చేస్తోందన్నారు. రాజమహేంద్రవరంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిని కేవలం యాక్సిడెంట్‌గా మాత్రమే పరిగణించటం లేదన్న హోం మంత్రి.. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోందన్నారు. రాజకీయంగా, మతపరంగా విద్వేషాలు రగిలేలా వ్యవహరించొద్దని

...మిగతా 2లో

## వారికి పూర్తి స్థాయి అధికారాలు ఇవ్వండి.. సీఎం ఆదేశాలు

**అమరావతి:** రాష్ట్ర సచివాలయంలో రెండవ రోజు కలెక్టర్ల సమావేశం జరుగుతోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలలోని అధికారులతో సంబంధం లేకుండా కొత్త జిల్లాలో జిల్లా అధికారులకు పూర్తిస్థాయిలో అధికారాలు డెలిగేట్ చేయాలని ఆదేశించారు. ఆయా జిల్లాలోని అధికారులు స్వేచ్ఛగా వారి విధులను నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్నారు. దీనిపై సంబంధించిన ఆదేశాలను హెచ్ఓడీలు రెండు రోజుల్లో జారీ చేయాలని తెలిపారు. కొత్త జిల్లాలలో ఎటువంటి స్టాఫ్ సమస్య లేకుండా స్టాఫ్ రెగ్యులేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

పని ఒత్తిడికి తగ్గట్టుగా అధికారులు, సిబ్బందిని కేటాయించాలని వెల్లడించారు. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్లలో ప్రత్యేకించి కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్లలో కనీసం మూడు హోటల్స్ ఉండేలా చూడాలన్నారు. కొత్త జిల్లాల్లో మౌలిక వసతుల కల్పన అంశంపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై రాష్ట్రస్థాయిలో చర్చిస్తున్నామని సీఎం అన్నారు. పేదరిక నిర్మూలనకు సంపదను సృష్టించే టూరిజం తదితర అంశాలకే భవిష్యత్తు అంతా ప్రాధాన్యతనిస్తుందని, భౌతిక వాదమే వస్తుందని అన్నానని.. కాబట్టి తాను చెప్పేదంతా జిల్లా కలెక్టర్లు అందరూ అర్థం చేస్తుకుని క్షేత్ర స్థాయిలో రియల్ టైమ్లో అమలుపరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. ఏపీలో ఐదు జోన్లు ఉన్నాయన్నారు. జోన్-1 లో విశాఖపట్నం,

...మిగతా 2లో



## కూనంనేని వ్యాఖ్యలపై నవ్వుతూ స్పందించిన సీఎం చంద్రబాబు

**అమరావతి:** తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలను కలెక్టర్ల సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ''గతంలో చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు.. ఏ ఇజం లేదు, ఇక టూరిజమే ప్రధానం అనేవారు.. ఏ ఇజం లేదంటే అప్పుడు మాకు కోపం వచ్చేది.. కానీ, నిజంగా ఖర్చులేని ఇజం ఏదైనా ఉందంటే అది టూరిజమే'' అని కూనంనేని అన్నారు. చంద్రబాబు నాడు

...మిగతా 2లో

## అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు అమానవీయం

### అత్యాచార నేరంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి నిందితులకు అనుకూలంగా తీర్పు చెప్పిన న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు సీరియస్

**ఢిల్లీ:** మహిళ దుస్తులను పట్టుకొని లాగటం, వక్షోజాలను తాకడం అత్యాచార నేరం కిందకు రాదంటూ అలహాబాద్ హైకోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం విదితమే. దీనిపై కేంద్ర మంత్రులు, బ్యూరోక్రాట్లు, న్యాయనిపుణులు, పలువురు తీవ్రంగా స్పందిస్తున్నారు. దీనితో సుప్రీంకోర్టు దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఆ న్యాయమూర్తి వ్యాఖ్యలు అమానవీయంగా ఉన్నాయంటూ వ్యాఖ్యానించిన జస్టిస్ బి.ఆర్.గవాయ్,

...మిగతా 2లో

## సభలో నన్ను మాటాడనిసలేరు

### లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

**ఢిల్లీ, మార్చి 26:** లోక్ సభలో తనను మాట్లాడేందుకు అనుమతించడంలేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సభా కార్యకలాపాలు నడిపించే తీరు ఇది కాదని ఆయన అన్నారు. మాట్లాడేందుకు అనుమతి కోరినా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే అవకాశం ఇవ్వడం సంప్రదాయమని గుర్తు చేశారు. బుధవారం లోక్ సభ వాయిదా

...మిగతా 2లో

### విశాఖలో లులూ మాల్..

## భూమి కేటాయించాలని ప్రభుత్వం ఆదేశం

**అమరావతి:** విశాఖలో లులూ గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏపీఐఐసీ ద్వారా లులూ గ్రూప్పకు విశాఖలో భూకేటాయింపులు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ బీచ్ రోడ్లోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాలను ఏపీఐఐసీకి బదలాయించాలని వీఎంఆర్డీఏకు ఆదేశాలు జారీ చేసింది. లులూ గ్రూప్ సంస్థ విశాఖ నగరంలో అంతర్జాతీయ స్థాయి

...మిగతా 2లో

## మహిళలతో కలిసి కోలాటం ఆడిన నారా భువనేశ్వరి

**అమరావతి:**ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటించారు. అందులో భాగంగా మహిళలతో మమేకమై ఉత్సాహంగా గడిపారు. గుడిచెంబగిరి గ్రామ పర్యటనలో మహిళలతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో కలిసి సరదాగా కోలాటం ఆడారు.

## శ్రీశైల మల్లన్న దర్శించుకున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**శ్రీశైలం మార్చి 26 (మనం న్యూస్):** శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ దర్శించుకున్నారు. బుధవారం ఆలయ రాజ గోపురం వద్దకు చేరుకున్న వారికి ఈవో శ్రీనివాస రావు పూలమాలతో స్వాగతం పలకగా అర్చక వేద పండితులు తిలకధారణ చేశారు. అనంతరం మోహన్ భగవత్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనాల అనంతరం అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో వేద పండితులచే వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని లడ్డు ప్రసాదాలు శేష వస్త్రాన్ని అందించారు.

## ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్కు.. మార్చి 31 వరకే గడువు

### మంత్రి నాదెండ్ల మనోహర్

**అమరావతి:**'దీపం 2.0' పథకం తొలి గ్యాస్ సిలిండర్ కోసం మార్చి 31 వరకే సమయం ఉందని ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని చెప్పారు. ఇప్పటి వరకూ 98 లక్షల మంది తొలి ఉచిత గ్యాస్ సిలిండర్లను వినియోగించుకున్నారని చెప్పారు.

## వర్మపై నాగబాబు కామెంట్స్.. పిఠాపురంలో మళ్లీ దబ్బిడి దిబ్బిడి

**కాకినాడ జిల్లా:** పిఠాపురంలో జనసేన వర్సెస్ టీడీపీల మధ్య విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. తమ నాయకుడు ఎస్వీఎస్ఎన్ వర్మ చెప్పబట్టే పవన్కు ఓటేశామంటూ జనసేన ఇన్ ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్పై వర్మ అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మర్రెడ్డి శ్రీనివాస్పై వాగ్వాదానికి దిగారు. దీంతో టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య తోపులాట

...మిగతా 2లో

## ఇఫ్తార్ విందుకు హాజరైన వైఎస్ జగన్

2

## చెట్ల నరికివేత 'హత్య'తో సమానమే

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- తాజ్ ట్రాపెజియం జోన్‌లో 454 చెట్లను కొట్టేయించిన వ్యాపారిపై సీరియస్
- ఆ చెట్లను తిరిగి పెంచడానికి కనీసం వందేళ్లు పడుతుంది
- ఒక్కో చెట్టుకు రూ.1 లక్ష చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశం

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** పెద్ద సంఖ్యలో చెట్లను నరికివేయడం మనిషిని చంపేయడానికి ఏమాత్రం తీసిపోని నేరమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తాజ్ ట్రాపెజియం జోన్‌లో ఏకంగా 454 చెట్లను నరికివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై మధురకు చెందిన దాల్మియా ఫార్మ్స్ కంపెనీ యాజమాన్యంపై తీవ్రంగా మండిపడింది. కొట్టేసిన చెట్ల స్థానంలో తిరిగి పచ్చదనం నెలకొల్పాలంటే కనీసం వందేళ్లు పడుతుందని పేర్కొంది. పర్యావరణానికి హాని కలిగించే వారి విషయంలో ఎలాంటి జాలి, దయ చూపాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. చెట్ల నరికివేతకు పాల్పడిన దాల్మియా ఫార్మ్స్ యజమానికి భారీ మొత్తంలో జరిమానా విధించింది. నరికివేసిన 454 చెట్లకు సంబంధించి ఒక్కో

...మిగతా 2లో

### వైకాపా హయాంలో మద్యం కుంభకోణం..

## కీలక నిర్ణయం దిశగా ఏపీ ప్రభుత్వం?

**అమరావతి:** వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వ్యవహారాన్ని ఏపీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. దీనిపై కీలక నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో జరిగిన మద్యం కుంభకోణంపై తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు

...మిగతా 2లో

## తిరుమలలో మరో అపచారం.. పవనానంద స్వామి ఎక్కడ?

2



## అమ్మా నన్ను మళ్లీ నీ పొట్టలో పెట్టి తెల్లగా పుట్టించమ్మా..

### నాలుగేళ్ల చిన్నారి ఈ ఆవేదన.. ఆమె వయస్సు, హోదాతో పెరుగుతూ వస్తోండడమే పెద్ద విషాదం

### ఒక రాష్ట్రానికి పాలనాధికారి అయినా తప్పని వేదన

### వర్ణ వివక్షపై కేరళ సీఎస్ బహిరంగలేఖ

**తిరువనంత పురం:** రంగులో ఏముంది.. గుణం ముఖ్యమంటారు పెద్దలు. ఆ మాట మనసులో పెట్టుకొని ఉన్నతస్థానాన్ని అధిరోహించారామె. చీఫ్ సెక్రటరీ అయినా ఆమె శరీర రంగు గురించి అన్న మాటలు మాత్రం వెంటాడాయి. చివరకు తన భర్త రంగుతోనూ పోలిక తెస్తూ చేసిన పోస్టులు కంటపడ్డాయి. వీటికి ఆమె బదులు ఇవ్వాలనుకున్నారు. ఈ క్రమంలో ఉద్వేగపూరితంగా

...మిగతా 2లో

కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్ పెట్టిన పోస్టు బాగా వైరల్ అవుతున్నది. దేశంలో వర్ణ వివక్షపై మరో సారి చర్చలకు కారణమైంది. రాష్ట్రంలోనే అత్యున్నత స్థానంలో ఉన్న ఐఏఎస్ అధికారికి కూడా వివక్ష ఎదురవడమనేది ఎన్నో ప్రశ్నలను రేకెత్తిస్తున్నది. ఆమె పోస్టులోని పూర్తి పాఠం..

## 'రా'పై అమెరికా ఆంక్షలు?

### భారత నిఘా సంస్థపై ఆరోపణలు

**ఢిల్లీ, మార్చి 26:** భారత దేశానికి చెందిన నిఘా సంస్థ 'రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా)' పై అమెరికా ఆంక్షలు విధిస్తోందా? అంటే అవుననే.. రీతిలో కొన్ని పరిణామాలు చోటు చేసుకుంటున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. 'యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలిజియస్ ఫ్రీడమ్' అనే అమెరికా సంస్థ 'రా'పై ఆంక్షలు విధించాలని అక్కడి ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. సిక్కు వేర్పాటువాదుల హత్యకు కుట్ర పన్నినట్లు

...మిగతా 2లో

# వారికి పూర్తి స్థాయి అధికారాలు ఇవ్వండి.. సీఎం ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

జోన్-2 లో రాజమండ్రి, జోన్-3 లో రాజధాని అమరావతి, జోన్-4 లో తిరుపతి, జోన్-5 లో అనంతపురం పవర్ హబ్లుగా ఉన్నాయని తెలిపారు. ఆ పవర్ హబ్ల ఆధారంగా ఆయా జోన్లలోని అన్ని జిల్లాలను అభివృద్ధి పర్చే విధంగా జిల్లా కలెక్టర్లు జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలుపరిస్తే రాష్ట్ర భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందని వెల్లడించారు.ప్రతి ఒక్క జోన్కు ఒక సీనియర్ అధికారిని ఇన్చార్జిగా ఉంచామన్నారు. ప్రతి జిల్లాకు ఇన్చార్జి మంత్రి కూడా ఉన్నారని తెలిపారు. వీరందరూ కలిసి ఆయన జిల్లాలను, ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో సమగ్రంగా చర్చించి క్షేత్ర స్థాయిలో తగు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారుర. గ్రామాల్లోని వాస్తవ విషయాలను తెలుసుకుని అందుకు తగ్గట్టుగా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే విధంగా, గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని రియల్ టైమ్లో పరిష్కరించేందుకై వచ్చే మాసం నుంచి సీనియర్ అధికారులు అంతా గ్రామాల్లో మూడు నాలుగు రోజులు ప్యటించాలని ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

# ఇఫ్తార్ విందుకు హాజరైన వైఎస్ జగన్

**విజయవాడ:** రంజాన్ సందర్భంగా వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విజయవాడ ఎన్ఏసీ కల్యాణ మండపంలో జరుగుతున్న ఇఫ్తార్ విందుకు వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు వైఎస్ జగన్ రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.

# కూనంనేని వ్యాఖ్యలపై నవ్వుతూ స్పందించిన సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పిన మాటే నిజమంటూ ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై సీఎం స్పందించారు. ''ఏ ఇజం లేదని నేను అంటే కమ్యూనిస్టులు నాపై విరుచుకుపడ్డారు. ఇప్పుడు ఖర్చు లేని ఇజం టూరిజమేనని స్టేట్మెంట్ ఇచ్చారు. నా మాటలు, ఆలోచలను అర్థం చేసుకోవడానికి 30 ఏళ్లు పట్టింది'' అని నవ్వుతూ చంద్రబాబు అన్నారు. అయితే.. ఇప్పుడంత సమయం లేదని, త్వరగా ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలని సీఎం పేర్కొన్నారు. ''రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయి. కలెక్టర్లు జిల్లాల వారీగా టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాలి. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. ఎక్కువ ఖర్చు లేకుండా ఉపాధి కల్పించే రంగం టూరిజమే'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

# వర్మపై నాగబాబు కామెంట్స్.. పిఠాపురంలో మళ్లీ దబ్బిడి దిబ్బిడి

జరిగింది.బుధవారం పిఠాపురంలో జనసేన శ్రేణుల్ని టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. గొల్లప్రోలు మండలం చెందూర్తిలో ఆర్వో ప్లాంట్ ఆవిష్కరణకు జనసేన ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ వచ్చారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎస్వీఎస్ఎన్ వర్మకు ఆహ్వానం అందలేదు. ఇదే అంశంపై వర్మ అనుచరులు మర్రెడ్డి శ్రీనివాస్ను నిలదీశారు. దీంతో ఏం చేయాలో పాలుపోని మర్రెడ్డి కార్యక్రమం మధ్యలోనే తిరిగి వెళ్ళిపోయారు.

వెళ్లే సమయంలో టీడీపీ,జనసేన శ్రేణులు ఒకరిపై ఒకరు వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. వర్మ చెప్పబట్టే పవన్ను ఓటు వేశామని వర్మ అనుచరులు,టీడీపీ కార్యకర్తలు తన మనసులో మాటను భయటపెట్టారు. వారికి పోటీగా జనసేన శ్రేణులు రావడంతో వాగ్వాదం జరిగింది. ఒకరినొకరు నెట్టుకున్నారు.

**నాగబాబు ఏమన్నారంటే?**

మార్చి 14న పిఠాపురం చిత్రాడలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహించింది. ఆ సభలో నాగబాబు ..పిఠాపురం టీడీపీ ఎస్వీఎస్ఎన్ వర్మను ఉద్దేశిస్తూ పరోక్షంగా మాట్లాడారు. 'పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుపులో ప్రధానంగా రెండు ఫ్యాక్టర్స్ పని చేశాయి. ఒకటి జనసేన ప్రెసిడెంట్ పవన్ కల్యాణ్. రెండు జనసైనికులు, పిఠాపురం ఓటర్లు' మరెవరైనా పవన్ గెలుపులో తమ పాత్ర ఉందని అనుకుంటే అది వారి ఖర్మ' అని నాగబాబు నొక్కి మరీ చెప్పారు.

**నాగబాబుకు వర్మ కౌంటర్**

ఆ వ్యాఖ్యలపై వర్మ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సభ జరిగిన తర్వాత వర్మ సైతం సోషల్ మీడియా వేదికగా జనసేనకు కౌంటర్ వేస్తూ పోస్టులు పెడుతూ వచ్చారు. ఈ తరుణంలో వర్మ అభిమానులు పిఠాపురం జనసేన మర్రెడ్డి శ్రీనివాస్పై బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చాంశనీయంగా మారింది.

# తిరుమలలో మరో అపచారం.. పవనానంద స్వామి ఎక్కడ?

**తిరుపతి:** తిరుమల క్షేత్రంలో మరో ఘోర అపచారం జరిగిందని.. సనాతన ధర్మాన్ని కాపాడతానన్న పవనానంద స్వామి(డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్) ఎక్కడ? అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్రెడ్డి నిలదీశారు. పాప వినాశనం డ్యామ్లో బోటింగ్ వ్యవహారంపై బుధవారం భూమన మీడియాతో మాట్లాడారు.

నిన్న పాప వినాశనం డ్యామ్లో బోటింగ్ చేశారు. ఆ నీటిని భక్తులు పవిత్రంగా చూస్తారు.అలాంటి డ్యామ్లో టూరిజం పేరుతో బోటింగ్ చేయడం ఏంటి?. టూరిజం వేరు.. అధ్యాత్మికం వేరు. టీటీడీ పరిధిలోనే పాప వినాశనం డ్యామ్ ఉంది. బోట్పై ఈవో, అడిషనల్ ఈవో సమాధానం చెప్పాలి అని భూమన డిమాండ్ చేశారు.

అటవీ శాఖ పవన్ కల్యాణ్ దగ్గరే ఉన్న సంగతి తెలిసిందే. ఆ శాఖ ఆధ్వర్యంలో తిరుమలలోని పాపవి

నాశనంలో మంగళవారం బోటింగ్ ట్రయల్ రన్ చేపట్టారు. కుమారధార, పసుపుధార నీరు మొత్తం పాపవినాశనంలో చేరుతుండగా.. ఈ ప్రాంతంలోనే పాపవినాశనం తీర్థం, గంగాదేవి ఆలయం ఉన్నాయి. ఈ క్రమంలో బోటింగ్ వ్యవహారంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల పుణ్యక్షేత్రాన్ని ఇలా పర్యాటక కేంద్రంగా మార్చే యత్నాలు మానుకోవాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# 'రా'పై అమెరికా ఆంక్షలు?

(మొదటి పేజీ తరువాయి)

'రా'పై ఆరోపణలు రావడమే దీనికి కారణమని ఆ దేశానికి చెందిన ఒక ఆంగ్ల వార్తా సంస్థ ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది. ఈ కమిషన్ వార్షిక నివేదికను మంగళవారం విడుదల చేసింది. దీనిలో భారత్ పై పలు ఆరోపణలు చేసింది. భారత దేశంలో మైనార్టీలు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. మత స్వేచ్ఛ విషయంలో ఆందోళనకర దేశంగా భారత్ ను ప్రకటించాలని సూచించింది. 2024లో కూడా భారత్ లో మతపరమైన మైనార్టీలపై వేధింపులు, దాడులు పెరుగుతున్నాయని వెల్లడించింది. ఈ నివేదికపై భారత్ తక్షణమే స్పందించలేదు.

చైనాను కట్టడి చేసే క్రమంలో అమెరికా పాలకులు భారత్, వియత్నాంతో కలిసి పనిచేస్తున్న సంగతి తెలిసిందే. బీజింగ్ ను కట్టడి చేయడానికి న్యూఢిల్లీ బలమైన శక్తి అని అమెరికా కొన్నేళ్లుగా భావిస్తోంది. ఈనేపథ్యంలో ట్రంప్ కార్యవర్గం భారత నిఘా సంస్థ 'రా'పై ఎటువంటి చర్యలు చేపట్టకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

2023లో అమెరికా, కెనడాలో సిక్కు వేర్పాటువాదులను భారత్ లక్ష్యంగా చేసుకొంటోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదయ్ పై అమెరికా ఆరోపణలు మోపింది. ఖలిస్థానీ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నినట్లు దానిలో పేర్కొంది. మరోవైపు అమెరికాలో ఉంటూనే పన్నూ భారత ప్రభుత్వానికి బెదిరింపు సందేశాలను విడుదల చేస్తుండటం విశేషం. సీఆర్పీఎఫ్ స్కూళ్లను, ఎయిర్ ఇండియా విమానాలను, కుంభమేళాను లక్ష్యంగా చేసుకోవాలని ఖలిస్థానీలకు అతడు పలుమార్లు నూరి పోస్తుండడం గమనార్హం.

# సభలో నన్ను మాట్లాడనిస్తలేరు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడేందుకు అనుమతించడం లేదు. మేం చెప్పాలనుకొనే అంశాలను లేవనెత్తేందుకు మాకు అనుమతి ఇవ్వడంలేదు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా కూర్చున్నా. ఏడెనిమిది రోజుల నుంచి నన్ను మాట్లాడేందుకు అనుమతించట్లేదు. ఇదో కొత్త ఎత్తుగడ. ప్రతిపక్షానికి ఇక్కడ చోటులేదు. ఇటీవల ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడినప్పుడు నేను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నా.. కానీ మాట్లాడేందుకు అనుమతించలేదు. మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించకపోవడం అప్రజాస్వామికం'' అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు.మరోవైపు, బుధవారం సభా కార్యకలాపాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. సభా గౌరవాన్ని కాపాడేందుకు నిబంధనలు పాటించాలని సూచించారు. సభలోని సభ్యులు హుందాగా వ్యవహరించాలన్నారు. సభ్యుల ప్రవర్తన ఈ సభ ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా లేదని అనేక సందర్భాల్లో తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ సభలో తండ్రీ కూతురు, తల్లీ కుమార్తె, భార్యా భర్తలను సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రతిపక్ష నేత 349 రూల్ (సభలో సభ్యులు పాటించాల్సిన ప్రవర్తనా నియమావళిని సూచించే నిబంధన) ప్రకారం నడుచుకుంటారని తాను ఆశించినట్లు తెలిపారు.

# పాస్టర్ ప్రవీణ్ మృతిపై లోతైన విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందన్నారు. ప్రమాదవశాత్తూ ఈ ఘటన జరిగిందా? ఏమైనా ఇంటెన్షన్ ఉందా? అన్న దానిపైనా విచారణ చేస్తున్నామన్నారు. అనుమానాస్పద మృతిగానే ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. ఘటనా స్థలికి సమీపంలో కాల్ డేటా రికార్డులు కూడా తీసుకుంటున్నామన్నారు. దర్యాప్తు విషయంలో ఎవరికీ ఎలాంటి అభద్రతా భావన అవసరం లేదని హోం మంత్రి తెలిపారు.

# అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు అమానవీయం

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం వాటిపై విచారం వ్యక్తం చేసింది. ఆ జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. ఆ వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కేంద్రం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

**అసలేమిటీ వివాదం..**

2021 నవంబరులో యూపీలోని కసగంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన 11 ఏళ్ల కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వారిని సమీపించి బాలికను ఇంటి దగ్గర దింపుతామని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో అమ్మాయిని అసభ్యంగా తాకుతూ కల్వర్టు కిందకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్నవారు రావడంతో నిందితులు బాలికను అక్కడే వదిలి పరారయ్యారు. ఈ కేసుపై మార్చి 17న విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా మహిళ వక్షోజాలను తాకడం, దుస్తులు పట్టుకొని లాగినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ నిందితులకు అనుకూలంగా తీర్పు వెలువరించారు. ఈ తీర్పు వివాదాస్పదమైంది. న్యాయమూర్తి వ్యాఖ్యలు న్యాయస్థానాలపై గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తమైంది. అటు కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి దీనిపై స్పందిస్తూ.. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలాంటి వ్యాఖ్యలతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరిపింది.

# ఎల్లో మీడియాపై వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డి ధ్వజం

**పులివెందుల:** ఎల్లో మీడియాపై మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి మండిపడ్డారు. వైఎస్ వివేకా హత్య కేసు విచారణను తప్పుదోవ పట్టించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు.

మాజీ ఎంపీ వైఎస్ వివేకా హత్య కేసు విషయంలో ఎల్లో మీడియా చేస్తున్న విష ప్రచారంపై వివేకా పీఏ కృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'తప్పుడు సాక్ష్యం ఇవ్వాలని గతంలో నన్ను విపరీతంగా కొట్టారు. తప్పుడు సాక్ష్యం చెప్పాలని సీబీఐ ఎస్పీ రాంసింగ్... నాపై థర్డ్ డిగ్రీ ప్రయోగించాడు.

సీబీఐ ఎస్పీ రాంసింగ్ చెప్పినట్లుగా తప్పుడు సాక్ష్యం చెప్పాలని వివేకా కుమార్తె సునీతారెడ్డి నన్ను బెదిరించింది. నేను తప్పుడు సాక్ష్యం చెప్పకపోతే.. తన భర్త జైలుకు వెళ్తాడని సునీతారెడ్డి చెప్పింది' అని అన్నారు.

# పరిటాల వర్గీయుల హల్చల్.. వైఎస్సార్సీపీ నేతలపై దాడి

**శ్రీ సత్యసాయి:** కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికారంలో ఉన్నారనే అహంతో వైఎస్సార్సీపీ నేతలను టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారు.

తాజాగా సత్యసాయి జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత వర్గీయుల హల్చల్ చేశారు. ఈ క్రమంలో టీడీపీ నేతల దారుణాలపై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాల ప్రకారం.. సత్యసాయి జిల్లాలోని రామగిరిలో టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత వర్గీయుల తాజాగా దాడులకు తెగబడ్డారు. వైఎస్సార్సీపీ ఎంపీటీసీలకు విప్ జారీ చేసేందుకు వెళ్లిన లాయర్ కురుబ నాగిరెడ్డి, వైఎస్సార్సీపీ నేతలు రామాంజనేయులు, హరిలపై దాడి చేశారు. ఈ క్రమంలోనే పరిటాల వర్గీయులు.. వాహనం ధ్వంసం చేశారు. ఇంత జరుగుతున్నా..

అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు తప్ప.. వారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు.

ఇక, రామగిరి మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. వైఎస్సార్సీపీ -8, టీడీపీ-1 ఒక్క స్థానంలో విజయం సాధించగా.. ఒక్క స్థానం ఖాళీగా ఉంది.

ఈ నేపథ్యంలో దాడులు, దౌర్జన్యంతో ఎంపీపీ పదవి కైవసం చేసుకోవాలని టీడీపీ కుట్రలు పన్నుతోంది.

ఇందులో భాగంగానే టీడీపీ నేతలు వైఎస్సార్సీపీ నేతలను టార్గెట్ చేస్తూ దాడులకు తెగబడుతున్నారు.

# భూమి కేటాయించాలని ప్రభుత్వం ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

మాల్ నిర్మాణం పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదించినట్టు పరిశ్రమల శాఖ వెల్లడించింది. 2017లో విశాఖ బీచ్ రోడ్లోని హార్బర్ పార్క్లో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు లులూ గ్రూప్ ముందుకు వచ్చింది. 2023లో లులూ గ్రూప్నకు చేసిన భూకేటాయింపులను వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం మళ్లీ షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణం కోసం లులూ గ్రూప్ ముందుకు వచ్చింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించి భూ కేటాయింపులు చేయాల్సిందిగా ఏపీఐఐసీని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆదేశించారు.

# వందేండ్ల ప్రశ్నకు జవాబు చెప్పిన బ్రిలియంట్ గర్ల్

**న్యూయార్క్ :** గణిత శాస్త్రంలో గత వందేళ్లుగా ఓ ప్రశ్న పరిష్కారం లేకుండా ఉండిపోయింది. పెద్ద పెద్ద శాస్త్రవేత్తలు సైతం దాన్ని సాల్వ్ చేసేందుకు ప్రయత్నించి విఫలయ్యారు. కానీ, తాజాగా భారత సంతతికి చెందిన ఓ అమ్మాయి ఆ ప్రశ్నను పరిష్కారించి.. బ్రిలియంట్ లేడీ అనిపించుకుంది. మరీ వందేళ్లుగా సాల్వ్ కానీ ఆ మ్యాథ్స్ ప్రాబ్లమ్ ఏంటి? సాల్వ్ చేసిన అమ్మాయి ఎవరు? ఇక్కడ తెలుసుకుందాం. భారత సంతతికి చెందిన దివ్య త్యాగి అనే అమ్మాయి అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్లో మాస్టర్స్ చదువుతుంది. ఓ వైపు చదువు కొనసాగిస్తునే మరోవైపు ఆయా అంశాలపై పరిశోధనలూ నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే 'కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్'లో కటింగ్ ఎడ్జ్ సాంకేతికతతో పలు ప్రయోగాలు చేస్తోంది. అయితే, పవన విద్యుత్ రంగంలో ఉపయోగించే గాలి మరల అంశంపై బ్రిటిష్ శాస్త్రవేత్త హెర్మన్ గ్లాయెర్ట్ 1926లో పలు పరిశోధనలు చేశారు. ఈ క్రమంలోనే ఆయన ఓ నమూనాను సైతం రూపొందించారు. అయితే, గాలి ప్రెషర్ వల్ల ట్బన్ రోట్ప ఎలాంటి ప్రభావం పడుతుంది? ఈ ఒత్తిడి వల్ల గాలి మరల బ్లేడ్లు ఎలా వంగి ఉంటాయి? వంటి కీలకమైన అంశాలకు పరిష్కారం చూపకుండానే వదిలేశారు. ఈ సమస్య పరిష్కారానికై గత వందేళ్లుగా ఎంతో మంది హేమాహేమీలు ప్రయత్నిస్తునే ఉన్నారు.

ఈ నేపథ్యంలోనే దివ్యకు గైడ్గా ఉన్న ప్రొఫెసర్ స్వెన్ ష్మిట్జ్ గాలి మరల మన్నికను పెంచే అంశంపైన పరిశోధన చేస్తున్నారు. ఈ క్రమంలో కలన గణితానికి సంబంధించిన ఈ సమస్యను పరిష్కరించమని తన విద్యార్థుల్లో నలుగురికి సూచించారు. అందులో దివ్య త్యాగి కూడా ఒకరు. ఇక విమానయాన రంగంలో తన పరిశోధనల్ని కొనసాగిస్తూనే వారంలో 10-15 గంటల అదనపు సమయాన్ని దివ్య ఈ గణిత సమస్య పరిష్కారానికి కేటాయించేది. చివరకు ఈ వందేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ప్రశ్నకు ఫార్ములా కనుక్కోవడంలో సఫలీకృతమైంది. అంతేకాదు, దివ్య చేసిన పరిశోధనలు గాలి మరల రూపకల్పనలో కొత్త మార్గాలకు తెరతీసినట్లయింది.ఈ పరిశోధనకు సంబంధించిన థీసిస్ 'విండ్ ఎనర్జీ సైన్స్' అనే జర్నల్లో ప్రచురితమైంది. 'బెస్ట్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్' థీసిస్గానూ ఘనత సాధించింది. అమెరికా వ్యాప్తంగా, ఇటు ప్రపంచవ్యాప్తంగా పాఠ్యాంశాల్లో చేర్చితే బాగుంటుందని వర్సిటీ సూచిస్తోంది.

# కీలక నిర్ణయం దిశగా ఏపీ ప్రభుత్వం?

(మొదటి పేజీ తరువాయి)

లోక్సభలో గళమెత్తిన సంగతి తెలిసిందే. రూ.4వేల కోట్లకు పైగా విదేశాలకు తరలించారంటూ ఆయన ఆరోపణలు చేశారు. మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్షాతో లావు శ్రీకృష్ణదేవరాయలు భేటీ అయ్యారు. తాజాగా సీఎం చంద్రబాబుతో ఆయన సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో మద్యం కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశముందనే చర్చ జరుగుతోంది.

# గీత దాటిన పోలీసులకు కోర్టు వ్యాఖ్యలు చెంపపెట్టు: శైలజానాథ్

**తాడేపల్లి:** రాష్ట్రంలో చట్టాలను గౌరవించకుండా కూటమి ప్రభుత్వం మెప్పుకోసమే పనిచేస్తున్న పోలీసులకు తాజాగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు చెంపపెట్టని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ సీనియర్ నేత సాకే శైలజానాథ్ అన్నారు. తాడేపల్లి ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో పోలీస్ యంత్రాంగ అనుసరిస్తున్న విధానాలపై న్యాయస్థానాలు కన్నెర్ర చేసినా వారి తీరు మారడం లేదని మండిపడ్డారు. చంద్రబాబు చెప్పినట్లుగా పొలిటికల్ గవర్నెన్స్ కోసమే పనిచేస్తే పోలీసులే నష్టపోతారని స్పష్టం చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే.. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా పోలీస్ యంత్రాంగం మీద న్యాయవ్యవస్థ చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను తీవ్రమైన ఆలోచనలో పడేశాయి. ప్రజలను కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థ సహజ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తోంది. స్వేచ్ఛాయుతమైన ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించడంలో కీలకమైన పోలీస్ యంత్రాంగం చంద్రబాబు జేబు సంస్థగా మారిపోవడం బాధాకరం. ఒకే కంటెంట్ ఉన్న కేసుల్లో ఇంప్లీడ్ కావొచ్చేమోకానీ, పలుచోట్ల ఎఫ్ఐఆర్లు కట్టాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు చెప్పిన సూచనలు పోలీస్ యత్రాంగం పట్టించుకోవడం లేదు.అరెస్ట్ చేయొద్దని చెప్పినా, పీటీ వారెంట్ పేరుతో అరెస్ట్ చేసిన సందర్భాలున్నాయి. ఒక ప్రణాళిక బద్ధంగా పైనుంచి వచ్చిన నాయకుల సూచనలను పోలీసులు పాటిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారు. ఒకానొక సందర్భంలో డీజీపీని కూడా కోర్టుకు పిలవాల్సి ఉంటుందని మెజిస్ట్రేట్ వార్నింగ్ ఇచ్చే దాకా తెచ్చుకోవడం పోలీస్ వ్యవస్థకు సిగ్గుచేటు. కోర్టు సీసీ టీవీ ఫుటేజీలు అడిగితే కోతులు కొరికేశాయని చెప్పుకునే పరిస్థితిని ఎందుకు తెచ్చుకోవాల్సి వచ్చిందో పోలీసులు ఆత్మవిమర్శ చేసుకోవాలి.

# చెట్ల నరికివేత 'హత్య'తో సమానమే

(మొదటి పేజీ తరువాయి)

చెట్టుకు రూ. లక్ష చొప్పున ఫైన్ విధిస్తూ తీర్పు వెలువరించింది. దీంతోపాటు తాజ్ ట్రాపెజియం జోన్ సమీపంలో మొక్కల పెంపకం చేపట్టాలని నిందితుడిని ఆదేశించింది. ఈ సందర్భంగా 2019లో ఇచ్చిన ఆదేశాలను కోర్టు గుర్తుచేసింది. తాజ్ ట్రాపెజియం జోన్ పరిధిలో అటవీ ప్రాంతం కానిచోట, ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోని భూముల్లో చెట్ల నరికివేతకు అనుమతి తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని తన తీర్పులో ఉదహరించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేతృత్వంలోని బెంచ్ ఈ తీర్పు వెలువరించింది.

# రామనవమికి పంబన్ బ్రిడ్జి ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

అధునాతన ఇంజనీరింగ్ అద్భుతంగా నిర్మించిన కొత్త పంబన్ బ్రిడ్జి శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 6వ తేదీన ప్రారంభం కానున్నది. ప్రధాని మోడీ రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం వంతెనకు ప్రారంభోత్సవం చేస్తారు.

తమిళనాడులోని సముద్ర తీరంలో ఉన్న చారిత్రక పంబన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో అదే పేరుతో కొత్త పంబన్ బ్రిడ్జిని నిర్మించారు. వర్టికల్ లిఫ్ట్ విధానంలో భారత్ లో నిర్మించిని తొలి రైల్వే బ్రిడ్జి ఇదే. వేగం, భద్రత, ఆవిష్కరణల కోసం రూపొందించిన బ్రిడ్జి ఇందంటూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల ఆ ఫోటోలను విడుదల చేశారు. దేశంలోని ప్రధాన భూభాగాన్ని తమిళనాడులోని రామేశ్వరం ద్వీపానికి ఈ బ్రిడ్జి కలుపుతుందని ఆయన తెలిపారు. భారీ ఓడలు వచ్చినప్పుడు వంతెన మధ్యలో తెరుచుకునేలా ప్రత్యేక గేట్లు కూడా ఏర్పాటు చేశారు.

# అమ్మా.. నన్ను మళ్లీ నీ పొట్టలో పెట్టి తెల్లగా పుట్టించమ్మా

(మొదటి పేజీ తరువాయి)

ఫేస్బుక్ లో ఓ పోస్టు పెట్టారు. ఆమే కేరళ చీఫ్ సెక్రటరీ శారదా మురళీధరన్.

1990 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారిణి. కొద్దినెలల క్రితమే కేరళ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. తన భర్త తర్వాత ఆ స్థానంలో శారద నియమితులవడం విశేషం. వారిద్దరిని గమనించిన పలువురు రంగు గురించి చేసిన కామెంట్లు ఆమె దృష్టికి వచ్చాయి. ''నా రంగును నేను అంగీకరించాల్సి ఉంది. ఈ క్రమంలోనే నేను ఒక పోస్టు చేశాను. ఆ తర్వాత వచ్చిన కామెంట్లతో కాస్త కంగారుకు గురై.. దానిని తొలగించాను. అయితే నేను పేర్కొన్న అంశాలు చర్చించాల్సినవేనని నా శ్రేయాభిలాషులు చెప్పడంతో మళ్లీ తిరిగి షేర్ చేశాను'' అని తాను డిలీట్ చేసిన మాటలను తిరిగి పంచుకున్నారు.

''ఒక సీనియర్ అధికారిణిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అంతకుముందు ఆ స్థానంలో ఉన్న భర్తతో పోలికలు తీసుకొచ్చారు. అదేదో సిగ్గుపడాల్సిన విషయం అన్నట్టు.. అది అసలు మంచి కాదన్నట్టు.. నా రంగు గురించి మాట్లాడారు. కానీ నలుపును ఎందుకు అవమానించాలి. అది విశ్వమంతా వ్యాపించి ఉన్న సత్యం. వర్షానికి ముందు కనిపించే వాగ్దానం. సాయంత్రానికి సూచిక.. అసలు అది లేనిదెక్కడ'' అంటూ రాసుకొచ్చారు. అలాగే చిన్నతనంలో తాను ఎదుర్కొన్న అనుభవాన్ని వివరించారు. ''ఈ రంగు చిన్నప

# తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి

- పేదరికం లేని సమాజమే సీఎం చంద్రబాబు లక్ష్యం
- టెక్నాలజీని విధ్వంసానికి వాడకండి
- దేవాన్ష్ లాగే తక్కువ స్క్రీన్ టైమింగ్ పాటించండి
- సైన్స్ అండ్ టెక్నాలజీలతో భారత్ గ్లోబల్ లీడర్ గా ఎదగాలి
- అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ విద్యార్థులతో నారా భువనేశ్వరి

**కుప్పం, మార్చి26 మనం న్యూస్ :** ప్రతి ఒక్కరికి అందుబాటులోకి వస్తున్న టెక్నాలజీని వ్యక్తిత్వ వికాసానికి వాడుకోవాలే గానీ విధ్వంసానికి కాదని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీని వాడుకోవడం తెలియక కొంతమంది యువత దుర్వినియోగం చేస్తోందని, ఇది వారి భవిష్యత్తును కాలరాస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లను ఎంతమేరకు వాడుకోవాలో అందరూ తెలుసుకోవాలని అన్నారు. కుప్పంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ను నారా భువనేశ్వరి సందర్శించారు. విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, అందరూ బాగా చదువుకొని దేశానికి గర్వకారణంగా మారాలని అన్నారు. విద్యార్థులకు చదువే ప్రథమ ప్రాధాన్యత కావాలని, అతిగా ఫోన్ల వాడకం , అధిక సమయం స్క్రీన్ చూడడం విద్యపైన ఉండాల్సిన వారి దృష్టిని మరల్చుతుందని అన్నారు. ఈ విషయంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని, తమ మనవడు దేవాన్ష్ కూడా టెక్నాలజీని ఎంతమేరకు నేర్చుకోవాలో అంత మేరకు మాత్రమే ఫోన్లు, గాడ్జెట్లు వాడతాడని, అధిక సమయం స్క్రీన్ మీద గడపడం ఉండదని అన్నారు. ఓ తల్లిగా చెబుతున్నానని , టెక్నాలజీని వ్యక్తిత్వ వికాసానికి మాత్రమే వాడుకోవాలని నారా భువనేశ్వరి సూచించారు.

**విద్య, పరిశోధనలకు అధిక ప్రాధాన్యత**

విజ్ఞానంతో నడిచే ఆర్థిక వ్యవస్థ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ కోరుకుంటారు. సామాజిక, ఆర్థిక ప్రగతికి విద్య చాలా కీలకమని ఆయన భావిస్తారు. విద్య, పరిశోధనలు దేశ ప్రగతికి కీలకం కాబట్టి తన పాలనలో సైతం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ ఎప్పుడూ ఉండాలని చంద్రబాబు కోరుకుంటారు. అందుకనే శాస్త్రీయ అవగాహనను పెంచే సంస్థ అయిన అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కు 1999లో 172 ఎకరాలు కేటాయించారు. దీని కారణంగా ఎటువంటి ఫలితాలు వస్తున్నాయో ఇప్పుడు చూస్తున్నాం. ప్రపంచంలో జనభాలో రెండో స్థానంలో ఉన్న మన దేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో 53వ స్థానంలో ఉంది. 2023లో సైన్స్ అండ్ టెక్నాలజీలో పేటెంట్లు పొందడంతో భారత్ ఆరో స్థానంలో ఉంది. త్వరలోనే మన దేశం గ్లోబల్ లీడర్ గా ఎదగాలి. సైన్స్ రంగంలో పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయించాలి. సైంటిఫిక్ టెంపర్ ను విద్యార్థుల్లో పెంచడం కోసం తన మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుంది.

**నిత్యం ప్రజా సేవలోనే**

ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి ప్రజలే కుటుంబసభ్యులు. ఆయన నిత్యం ప్రజల గురించే ఆలోచిస్తారు. ఏపీని నెంబర్ వన్ స్టేట్ చేయాలని, పేదరికం లేని సమాజం స్థాపించాలని ఆయన అనునిత్యం తపిస్తారు. స్వర్ణాంధ్ర - విజన్ 2047 లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారు. చంద్రబాబు గారు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి . ఒక్కోసారి ఆయన రాత్రి 12 గంటల వరకూ పనిచేస్తారు. అయినా ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి యోగా చేస్తారు. నాకు చిన్న వయసులోనే వివాహమైంది. రాజకీయాల గురించి అప్పట్లో నాకు తెలీదు. నేను హెరిటేజ్ వ్యవహారాలు, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చూసుకునేదాన్ని. చల్లపల్లిలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారు. వారిని చూస్తే నాకు గర్వంగా అనిపిస్తుంది. యువత బాగా చదువుకోవాలి. ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధించాలి. టెక్నాలజీ మీద అవగాహన పెంచుకోవాలి. యువత క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై దృష్టి పెడితే అద్భుత ఫలితాలు సాధించవచ్చు.

**తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి**

నా తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి. మా నాన్నగారు ఎంతో కష్టపడి పైకి వచ్చారు. చిన్న వయసులో ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారు. ఆ తర్వాత స్కూల్ కి వెళ్లి చదువుకునే వారు. కుటుంబం కోసం ఆయన పడిన కష్టం మేము కళ్లారా చూశాం. షూటింగులతో బిజీగా ఉండటం వల్ల మేము ఆయన్ని చాలా రోజులు చూసేవాళ్లం కాదు. మేము నిద్రపోయినప్పుడు వచ్చేవాళ్లు... లేచేప్పటికి వెళ్లిపోయేవాళ్లు. మా తల్లిదండ్రులు మమ్మల్ని చాలా పద్ధతిగా పెంచారు . ఇంటికి వచ్చే అతిథులను ఎలా గౌరవించాలో మా అమ్మగారు మా అందరికీ చెప్పేవారని నారా భువనేశ్వరి అన్నారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి నారా భువనేశ్వరి భోజనం చేశారు.

# తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న కూటమి సర్కార్

- శ్రీవారి క్షేత్రంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలా?
- అధికారిక ప్రకటనలో సాక్షాత్తు డీఎఫ్ఓనే అంగీకరించారు
- దీనిపై విజిలెన్స్, పోలీస్ యంత్రాంగం ఏం చేస్తోంది?
- ప్రశ్నించిన మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్రెడ్డి

**తిరుపతి, మార్చి 26 మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని వైయస్ఆర్సీపీ అధికార ప్రతినిధి, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్రెడ్డి మండిపడ్డారు. తిరుపతి క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పవిత్రమైన పాపవినాశనం జలాల్లో బోటింగ్ నిర్వహించడం శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బోటింగ్ పర్యాటకం కోసం చేశారా? లేక చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా కోసం చేశారా అనే దానిపై టీటీడీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే...

తిరుమలలో కూటమి ప్రభుత్వం మరో ఘోర అపచారానికి పాల్పడింది. వెంకటేశ్వరస్వామి ఆలయ క్షేత్రాన్ని పరిరక్షిస్తామని ప్రచారం చేసుకుని ఓట్లు దండుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత శ్రీవారి ఆలయ పవిత్రతను భ్రష్టు పట్టిస్తున్నారు. నిన్న పాపవినాశనం డ్యాంలో తిరుమల చరిత్రలోనే తొలిసారిగా బోటింగ్ జరిగింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో అటవీశాఖ సిబ్బంది బోటింగ్ ట్రైల్ రన్ నిర్వహించినట్లు, పర్యాటక కేంద్రంగా మార్చాలనే ఉద్దేశంతోనే ఈ బోటింగ్ ట్రైల్ నిర్వహించారని తెలుగుదేశంకు వంతపాడే ఎల్లోమీడియా పత్రికలు రాశాయి. దీనిపై వివాదం తలెత్తడంతో అటవీశాఖ అధికారి వివేక్ స్పందిస్తూ డ్యాం పరిధిలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయనే సమాచారంతో తనిఖీల కోసమే బోటింగ్ను నిర్వహించామని ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాంతం పూర్తిగా తిరుమల తిరుపతి అటవీశాఖ పరిధిలోకి వస్తాయి. ఈ వివేక్ అనే అధికారి టీటీడీ పరిధిలోని అటవీశాఖ అధికారి అయితే ఆయనతో కాకుండా ఇటువంటి సీరియస్ అంశంపై టీటీడీ ఈఓ, జేఈఓ స్థాయి అధికారులే వివరణ ఇస్తారు. అలా కాకుండా డీఎఫ్ఓతో వివరణ ఇప్పించడం వెనుక మతలబు ఏమిటీ?

**ట్రైలర్లో పాల్గొన్న వారి వివరాలు బయటపెట్టాలి**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తిరుమలలో ఎన్నో దురాగతాలు జరుగుతున్నాయనేది డీఎఫ్ఓ వివేక్ అనే అధికారి ప్రకటనతోనే బయటపడ్డాయి. పవిత్ర క్షేత్రంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతుంటే విజిలెన్స్, పోలీస్ యంత్రాంగం ఏం చేస్తోంది? టీటీడీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? తిరుమలలో చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరగుతున్నాయనే సమాచారంతోనే బోటింగ్ ద్వారా నిఘా నిర్వహించామని అధికారులు అంగీకరిస్తున్నారు. తాజాగా జరిగిన ట్రైల్ రన్లో పాల్గొన్న అటవీ సిబ్బంది ఎవరో బయటపెట్టాలి. ఆ బోట్లలో నడిపిన వారు కాకుండా, దానిలో కూర్చున్న వారు అటవీశాఖ సిబ్బందేనా? ఆ ఫోటోలను బట్టి చూస్తే ఈ బోట్లను టూరిజం విభాగం వారే నడిపినట్లుగా తెలుస్తోంది. ఇటీవల తిరుమలకు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు రాష్ట్రంలో టూరిజాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసే ఆలోచనలో భాగంగా ఆలయాల్లో టూరిజాన్ని ప్రోత్సహిస్తానని ప్రకటించారు. టూరిజం అంటేనే విలాసం, విహారం. ఆధ్యాత్మిక యాత్రలు వేరు, టూరిస్ట్ యాత్రలు వేరు. చంద్రబాబు ప్రకటించిన తరువాత ఈ బోటింగ్ జరిగిందంటేనే ఆధ్యాత్మిక క్షేత్రాన్ని అధ్వాన్న పరిచి, పర్యాటక కేంద్రంగా మారుస్తున్నారని అర్థమవుతోంది. టూరిజం కోసం ట్రైల్ రన్ అని ఒకరు, కాదూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిఘాకోసం అంటూ అటవీశాఖ అధికారి ప్రకటించడం వెనుక ఉన్న కారణం ఏమిటో చెప్పాలి. ఈ వ్యవహారం టీటీడీకి తెలిసి జరిగిందా? తెలియకుండా జరిగిందా అనే దానిపై స్పష్టత ఇవ్వాలి.

**అటవీశాఖ మంత్రి పవన్ స్పందించాలి**

ఈ వ్యవహారంపై అటవీశాఖ మంత్రి కాషాయాంబరధారి, పవనానందల స్వామి వివరణ ఇవ్వాలి. గత కొంతకాలంగా తిరుమల పవిత్రతను దెబ్బతీసే ఇటువంటి ఘటనలు జరుగుతున్నా పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదు. సనాతనధర్మాన్ని మౌనంతో సాధించాలని ఆయన భావిస్తున్నారని అనుకోవాలా? అటవీశాఖ పూర్తిగా పవన్ కళ్యాణ్ ఆధీనంలోనే ఉంది. తన శాఖ పరిధిలో జరుగుతున్న ఈ ఘటనలపై ఆయన ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు? తిరుమలపై ప్రభుత్వం అవకాశం ఇస్తున్నందునే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీయడానికే కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందా? అని ప్రశ్నించారు.

# ఆంధ్ర భద్రాచలం ఏకశిలా నగరం

- పున్నమి వెలుగులో రాముల వారి కల్యాణం
- కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

**తిరుపతి, మార్చి 26 మనం న్యూస్:** పురాణాల ప్రకారం త్రేతా యుగంలో శ్రీ రామచంద్రుడు దండకారణ్యంలో సీతా లక్ష్మణ సమేతుడై సంచరించారు. సీతాదేవి దప్పిక తీర్చడానికి భూమిలోకి బాణం వేయగా నీటి బుగ్గ పడింది. అదే

ఒంటిమిట్టలోని రామతీర్థమైంది. సీత అన్వేషణ కోసం రావణ సంహారం కోసం శ్రీరామచంద్రునికి సహకరించిన హనుమంతుని పరివారంతో పాటు జాంబవంతుడు కూడా ఉన్నారు. ఆ జాంబవంతుడు సేవించిన సీత లక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడే నేడు ఒంటిమిట్ట ఆలయంలో కొలువై ఉన్నారు. ఒకే రాతిపై శ్రీ సీత రామ లక్ష్మణ దేవత మూర్తులు ఉండడంవల్ల ఒంటిమిట్టను ఏకశిలా నగరం అని కూడా అంటారు. ఈ దేవాలయ నిర్మాణం 14వ శతాబ్దంలో ప్రారంభమై 17వ శతాబ్దానికి పూర్తయినట్లు ఆలయంలో ఉన్న శాసనాలు తెలుపుతున్నాయి. 1356లో బుక్కరాయలు, ఆ తర్వాత కాలంలో విజయనగరాజులు, మట్లి రాజులు క్రమంగా గుడి అంతరాలయం, రంగ మండపం, మహా ప్రాంగణం, గోపురాలు నిర్మించారు.

ఆంధ్రా భద్రాచలం అయిన ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంను రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌ.శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 2015, సెప్టెంబరు 9న టిటిడి ఆధీనంలోకి వచ్చింది. అప్పటి నుండి పురాతన చారిత్రక ప్రాశస్త్యం గల రామాలయంను ఆర్కియాలజి సర్వే ఆఫ్ ఇండియా అనుమతులు తీసుకుని ఆలయం లోపల, బయట టీటీడీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది.

ఇందులో భాగంగా ప్రతి ఏడాది శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సర్వంగా సుందరంగా కల్యాణ వేదిక, కల్యాణాన్ని వీక్షించే భక్తుల సౌకర్యార్థం షెడ్లు, మరుగుదొడ్లు, యాత్రీకుల వసతి సముదాయాలు నిర్మించారు. అదేవిధంగా ఆలయ లోపల పోటు, యాగశాల, పరిసరాల మరమ్మత్తులు, నూతన పుష్కరిణి, వాహన మండపం నిర్మాణం, మాడ వీధులలో సిసి రోడ్లు, డ్రైనేజి తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు మరింత అహ్లాదకర ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు పరిసరాలలో పచ్చదనం పెంపొందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు, ఈవో శ్రీ జె.శ్యామలరావు ఆధ్వర్యంలో, జెఈవో శ్రీ వి. వీరబ్రహ్మం పర్యవేక్షణలో ఏప్రిల్ 11న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు పున్నమి వెలుగులో అత్యంత వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కల్యాణానికి విచ్చేసే లక్షలాధి మంది భక్తులకు అవసరమైన తాగునీరు, అన్నప్రసాదాలు, భద్రత, రవాణా, వైద్యం, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర అంశాలపై టీటీడీ, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేస్తోంది.

**రాములవారిపై సాహిత్యం :**

ఎందరో మహాకవులు తన సాహిత్యం ద్వారా శ్రీరామచంద్రుని కరుణకు పాత్రులయ్యారు. పోతన ఇక్కడే భాగవతాన్ని అనువదించినట్టు తెలుస్తోంది. అయ్యలరాజు తిప్పయ్య ఒంటిమిట్ట రఘువీర శతకం చెప్పారు. రామభద్రుడు 'రామాభ్యుదయం' రచించారు. నల్లకాల్వ అయ్యప్ప ఒంటిమిట్ట రాముని వరం పొంది వరకవి అయ్యారు. ఉప్పు గొండూరు వేంకటకవి ఒంటిమిట్ట రశరథరామ శతకం చెప్పారు. వావిలికొలను సుబ్బారావు ఆంధ్రవాల్మీకి రామాయణాన్ని మందర వ్యాఖ్యతో రచించారు. తాళ్లపాక అన్నమయ్య రామునిపై పలు సంకీర్తనలు ఆలపించారు.

# ఘనంగా శ్రీ తాళ్లపాక అన్నమయ్య 522వ వర్ధంతి మహోత్సవాలు ప్రారంభం

- అన్నమాచార్య కళామందిరంలో ఆకట్టుకున్న సంకీర్తనల గోష్ఠిగానం

**తిరుపతి, మార్చి 26 మనం న్యూస్ :** శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలు టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం ఆకట్టుకుంది.

ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు, స్థానిక కళాకారులు కలిసి దినము ద్వాదశి, సప్తగిరి సంకీర్తనలను రాగయుక్తంగా ఆలపించారు. ఇందులో బ్రహ్మకడిగిన పాదము., శరణంటూ, హరి అవతారమితడు అన్నమయ్య.., శరణు శరణు కీర్తనలను కళాకారులు ఆలపించారు. అనంతరం హారతి, మహానివేదన చేపట్టారు.

ఉదయం 10.30 గంటలకు అన్నమయ్య వంశీయులు చైన్నైకి చెందిన డా. తాళ్లపాక మీనలోచని బృందం అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా ఆలపించారు. తరువాత ఉదయం 11.30 గంటలకు తిరుపతికి చెందిన శ్రీమతి జయంతి సావిత్రి బృందం ' అన్నమయ్య జీవిత చరిత్ర ' పై హరికథ గానం చేశారు.

సాయంత్రం 6 నుండి రాత్రి 7 గంటల వరకు తిరుపతికి చెందిన కుమారి అనూష, కుమారి ఆర్తి బృందం సంగీత సభ, రాత్రి 7 నుండి 8.30 గంటలకు వరకు ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు శ్రీ వేంకటేశ్వర్లు భాగవతార్ బృందం హరికథ గానం నిర్వహించనున్నారు.

తాళ్ళపాక ధ్యానమందిరం.....

తాళ్ళపాక ధ్యానమందిరం వద్ద బుధవారం ఉదయం 8 నుండి 11 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు తిరుపతికి చెందిన శ్రీ ఉదయ్ భాస్కర్, శ్రీమతి లావణ్య బృందం సంగీత సభ, రాత్రి 8 నుండి 9.30 గంటల వరకు తిరుపతికి చెందిన శ్రీ రమేష్ బాబు బృందం హరికథ గానం చేయనున్నారు.

అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద.....

రాజంపేట-కడప హైవేలో ఉన్న 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద బుదవారం సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శ్రీ సరస్వతీ ప్రసాద్, శ్రీమతి భార్గవి బృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించనున్నారు. రాత్రి 8 నుండి 9.30 గంటల వరకు తిరుపతికి చెందిన వెంకట కృష్ణయ్య బృందం హరికథ కార్యక్రమాలు జరుగనున్నాయి.

ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు శ్రీ రాజగోపాలరావు, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# స్విమ్స్ కార్మికులకు వేతనాలు పెంచాలి... వివక్ష వీడాలి: సీఐటీయూ

**తిరుపతి, మార్చి 26 మనం న్యూస్ :** స్విమ్స్ కార్మికుల కు వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కారం చేయాలని బుధవారం ఉదయం స్విమ్స్ ఆసుపత్రి నుండి కార్మికులు ప్రదర్శనగా టీటీడీ పరిపాలన భవనం వద్దకు చేరుకుని అక్కడ మధ్యాహ్నం ధర్నా

నిర్వహించారు. ధర్నా అనంతరం టీటీడీ జేఈవో వీర బ్రహ్మం కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ధర్నా ను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ స్విమ్స్ ఆస్పత్రి ఏర్పడినప్పటి నుండి నేటి వరకు పనిచేస్తున్న కార్మికుల కు వేతనాలు పెంచటం లేదని, సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు మారుతున్నా, కార్మికుల జీవితాలు వారి తలరాతలు మాత్రం మారడం లేదని అన్నారు. గతంలో స్విమ్స్ ఏర్పడినప్పుడు ఉద్యోగాల్లో వార్డు బాయులుగా చేరిన వీరిని శానిటేషన్ కార్మికులుగా పేరు మార్చడం వల్ల వీరికి శాపంగా మారిందని అధికారులు చేసిన తప్పులకు కార్మికులు బలవుతున్నారని అన్నారు. శానిటేషన్ పేరు పెట్టడంతో మిగిలిన విభాగాల వారికి అన్ని రకాల సౌకర్యాలు వర్తిస్తున్నాయని జీతాలు పెరుగుతున్నాయని, వీరికి మాత్రం ఎటువంటి సౌకర్యాలు వర్తించటం లేదని చాలీచాలని జీతాలతో కాలం వెళ్ళదీయాల్సి వస్తుందని అన్నారు. అధికారులు చేసిన తప్పులను అధికారులే సరిదిద్దుకోవాలని వీరికి శానిటేషన్ పేరు తీసి వార్డ్ బాయ్స్ గా మార్చాలని డిమాండ్ చేశారు.

పని భారం నుండి కార్మికులకు మినహాయింపు ఇవ్వాలని కార్మికులతో అన్ని పనులు చేయించడొ, ఊడవటం మొదలు ఆపరేషన్ థియేటర్లో అన్ని పనులు వరకు వీరి దగ్గరే చేయిస్తూ తీవ్ర పనిభారం మోపుతున్నారని నిర్దిష్టమైన పనిని కేటాయించడం లేదని వీరికి నిర్దిష్టమైన పనిని కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో మూడుసార్లు స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహించినాస్వయంగా డైరెక్టర్ చర్చల్లో పాల్గొని సమస్యలపై హామీ ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన భవనం ముందు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని, టీటీడీ స్విమ్స్ సమన్వయంతో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని లేని పక్షంలో సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, సిఐటియు తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్ ఇరువురు మాట్లాడుతూ స్విమ్స్ గతంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడు టీటీడీలోకి విలీనం చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని, వేతనాలు పెరుగుతాయని కార్మికులందరూ ఆశపడ్డారని దానికి భిన్నంగా ప్రభుత్వం నుండి టీటీడీలోకి విలీనం చేసిన తరువాత పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టుగా వీరి పరిస్థితి అయిందని అన్నారు.

టీటీడీ స్విమ్స్ పై స్విమ్స్ టీటీడీ పై ఒకరి ఒకరు దాట వేసుకుంటూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని పరిష్కారం చేయడం లేదని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక శాఖకు, టీటీడీ ఈవో కు లేఖలు పంపినా పరిష్కారం కాలేదని టీటీడీ పరిపాలనా భవనం ముందు నిరసన కార్యక్రమం చేపడుతున్నామని, ఎప్పటికైనా టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పట్ల సానుకూలంగా వ్యవహరించి పరిష్కారం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జేఈవో వీర బ్రహ్మం కు కార్మికుల సమస్యలపై ఆరు మందితో కూడిన సిఐటియు బృందం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సానుకూలంగా స్పందించిన జేఈవో గారు వెంటనే ఈ సమస్యల పట్ల చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిమ్స్ కార్మికుల యూనియన్ కార్యదర్శి రవి అధ్యక్షులు సూరి కోశాధికారి మారి ముత్తు నాయకులు గోపి వేలు వెంకటేష్ విజయలక్ష్మి సుబ్రహ్మణ్యం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ బెట్టింగ్ పై తక్షణ చర్యలు తీసుకోవాలి

- తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

**తిరుపతి, మార్చి 26 మనం న్యూస్ :** ఆన్లైన్ బెట్టింగ్ తక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పార్లమెంట్ జీరో అవర్ లో కోరారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా తిరుపతి ఎంపీ బుధవారం మాట్లాడుతూ ఆన్లైన్ బెట్టింగ్. జూదయాప్లతో సమాజంలో ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. ఆన్లైన్ బెట్టింగ్ యాప్లు సులువుగా అందుబాటులోకి రావడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆయన వాపోయారు. ముఖ్యంగా యువత భారీ మొత్తంలో డబ్బు పోగొట్టుకుంటూ తీవ్రంగా ప్రభావితం అవుతున్నారన్నారు. కొంత మంది విద్యార్థులు, ఉద్యోగస్తులు తమ సంపాదనను ఈ యాప్లలో పోగొట్టుకుని అప్పుల్లో కూరుకుపోతున్నారని పార్లమెంట్ దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ఈ ప్లాట్ఫారమ్ల ద్వారా త్వరగా డబ్బు సంపాదించాలనే తలంపు చివరికి మోసాలు, దొంగతనాలు, ఇతర అక్రమ కార్యకలాపాలకు ప్రేరేపిస్తున్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. యువత తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ బెట్టింగ్ యాప్ల మాఫియా గ్యాంగ్ల చేతుల్లో నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ నియంత్రణను కూడా అధిగమించి తరచూ కొత్త పేర్లతో బెట్టింగ్ యాప్ల పునరావృతమవుతున్నాయని ఎంపీ గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, ఆన్లైన్ బెట్టింగ్, జూద యాప్లపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అంతేకాకుండా, సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ను ఏర్పాటు చేసి ఈ యాప్లను పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఆన్లైన్ బెట్టింగ్ నష్టాల గురించి అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

# పన్నులు చెల్లింపు దారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు

- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు,మార్చ్ 26,మనం న్యూస్:** ఆస్తి పన్ను చెల్లింపుదారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించిందని, నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన పన్నులను గడువులోగా చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ప్రజా దర్బార్లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నగరపాలక పరిధిలో



భవనాలు, వ్యాపార సముదాయాలు, ఖాళీ స్థలాల యజమానులు 2024-25కు సంబంధించి ఆస్తి పన్నులను 2025, మార్చి 31వ తేదీలోగా చెల్లించి నగరాభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందించాలన్నారు. 2024 - 25 కు సంబంధించి ఇదివరకే 2024 ఏప్రిల్ 1వ తేదీ తర్వాత పన్ను చెల్లించిన వారికి ఈ 50శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. రాయితీ సొమ్ములను రాబోయే ఏడాదికి జమ చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఇలాంటి అవకాశాన్ని ఇవ్వలేదని.. పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం రాష్ట్రంలోని కూటమి మంచి నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా చిత్తూరు నగరపాలక పరిధిలో సుమారు రూ.11 కోట్ల మేర పన్నుదారుకు లబ్ధి చ

## జయహో..

ధరిత్రి మురిసిపోయింది
అకుంఠిత దీక్షతో
ఆకాశాన్ని జయించి
చిరునవ్వుతో తిరిగి వచ్చిన
నీ ధీరతను చూసి
ఎంత కష్టమైనా భరించి
గెలిచి నిలిచిపోవాలన్న
నీ సంకల్ప బలం
రేపటి తరాలకు దారి దీపం
కోట్ల విజయాలైనా
ఆకాశలోకంలో తొమ్మిది నెలల
నీ ఆత్మవిశ్వాసపు
జీవనం ముందు బలాదూర్..!
సెల్యూట్ టు యూ
సునీత విలియమ్స్..
చరిత్రలో ఇప్పుడు నీవొక
మహోన్నత అధ్యాయం
రేపటి ఉజ్వలతకు
అసమాన అద్భుతాలకు
నువ్వొక నాందీ గీతం...

**- డా. తిరునగరి శ్రీనివాస్**
9441464764

# మొగ్గల్ని చిదిమేస్తున్న ఒత్తిడి

అందమైన బాల్యం, జ్ఞాపకాలను పొగేసుకునే వయసు. ఆ లేత మనసుపై ఒత్తిడి పెరిగితే ఎన్ని అనర్థాలకు దారి తీయిస్తుందో.... పిల్లలంఆ ఎప్పుడో ఒకప్పుడు ఒత్తిడికి లోనవ్వటం మామూలే. హోంవర్క్ చేసేటప్పుడో, స్నేహితుల గురించో, వార్షిక పరీక్షలు రాసేటప్పుడో ఆందోళన చెందటం చూస్తూనే ఉంటాం. కానీ కొందరు పిల్లలు అతిగా ఒత్తిడికి గురవుతుంటారు. ఇది పెద్దయ్యాక శారీరక, మానసిక సమస్యలకు దారి తీయొచ్చు. రోజువారీ జీవితంలో ఒత్తిడికి గురిచేసే అంశాలెన్నో ఎదురవుతుంటాయి. అవి మామూలు ఒత్తిడి అయితే జీవితంలో ఎదగడానికి, నేర్చుకోవటానికి తోడ్పడుతాయి. సాధారణ ఒత్తిడిని సానుకూలంగా మలుచుకుంటే సామర్థ్యం పెరగటానికి దోహదపడుతుంది. ఈ ఒత్తిడులు దీర్ఘకాలం కొనసాగితే శారీరకంగా, మానసికంగా దెబ్బతీస్తాయి. చుట్టుపక్కల హింస, వివక్ష, తీవ్ర పేదరికం,లైంగిక వేధింపులు చుట్టుముడితే పసి మనసు చిగురుటాకులా వణికిపోతుంది. పది రకాల కారణాలతో పిల్లలు తీవ్ర ఒత్తిడికి గురవుతూ మానసిక వేదనను అనుభవిస్తున్నట్లు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడయింది. పది నుంచి పద్దెనిమిదేళ్ల వయస్సున్న పిల్లలపై జరిపిన అధ్యయనంలో చిన్నారులు ఒత్తిడికి గురైనప్పుడు మెదడు నిర్మాణ, పనితీరులో మార్పులు చోటుచేసుకుంటున్నట్లు గుర్తించారు. మెదడులో ఉండే వైట్‌మ్యాటర్ ఎక్కువై గట్టిపడుతుంది. దీని వల్ల కొత్త విషయాలు వారి బుర్రకెక్కడం లేదన్నారు. తమను అంటిపెట్టుకొని ఉండే వ్యక్తులను కోల్పోవడం, ఇతరులతో గొడవలు పడటం, ఏదైనా విషయానికి భయపడటం, నిర్దేశిత పనులను చేయాలని బలవంతపెట్టడం, శిక్షకు గురయ్యే సందర్భాలు, అనారోగ్యం, చదువు ఇతరత్రా పనుల్లో వెనుకబడి వుండటం, ఒకే విషయాన్ని పదేపదే చేయడం, అభద్రతాభావం, భౌతిక మానసిక అనారోగ్యం వంటి కారణాల వల్ల పిల్లల్లో ఒత్తిడి పెరగడానికి ఆస్కారమున్నట్లు అధ్యయన నివేదిక వెల్లడించింది.

మత్తుకు బానిసైన ఓ విద్యార్థి అర్ధాంతరంగా తనువు చాలించగా, చదువులో ఒత్తిడి భరించలేక మరో యువతి కళాశాలపైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రుల గొడవల వల్ల నలిగిపోయిన ఓ చిన్నారి తీవ్ర మానసిక ఒత్తిడికి గురై తనువు చాలించింది. ఇలాంటి ఘటనలు తరచుగా వింటూ ఉంటున్నాము. క్షణికావేశంతో నిండు నూరేళ్ల జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా కన్నవారికి తీవ్ర కడుపు కోతను మిగుల్చుతున్నారు. కుటుంబ కలహాలు, ప్రేమ వైఫల్యం, మత్తు పదార్థాలకు బానిస కావడం,చదువులో వెనకపడటం వంటి కారణాలతో ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 15-20 శాతం తీవ్ర కుంగుబాటు సమస్యను ఎదుర్కొంటున్నట్లు మానసిక వైద్యులు పేర్కొంటున్నారు. కొందరు క్షణికావేశంతో తనువు చాలిస్తే, మరికొందరు ఎంతో మానసిక సంఘర్షణ అనుభవించి చివరకు ఈ దారి ఎంచుకుంటున్నారు. వారిలోని బాధను అర్థం చేసుకొని సరైన మనోధైర్యం కల్పించకపోవడంతో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి.

సవాళ్లను ఎదుర్కొనే శక్తిసామర్థ్యాలు, ఆత్మ విశ్వాసం కోల్పోయి, మానసిక దౌర్బల్యానికి లోనై ఎంతో మంది పిల్లలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. 2022లో 10,205 మంది పద్దెనిమిదేళ్లలోపు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. 2011 నుంచి విద్యార్థుల ఆత్మహత్యలు తీవ్రమయ్యాయని జాతీయ నేర గణాంక సంస్థ(ఎన్‌సీఆర్‌బి) లెక్కలు చెబుతున్నాయి. 2011లో 7,696 మంది చిన్నారులు ఆత్మహత్య చేసుకున్నారు. 2021 నాటికి ఆ సంఖ్య 13,089కి చేరింది. పదేళ్లలో విద్యార్థుల బలవన్మరణాలు భారీగా పెరిగాయి. యుక్త వయసు బాలల్లో మత్తు పదార్థాల వినియోగమే కాదు, తోటివారిపై అత్యాచారలు, బెదిరింపులకు పాల్పడటం వంటి ఘటనలూ పెరుగుతున్నాయి. కోవిడ్ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థతోపాటు బాలల ఆరోగ్య, మానసిక, సామాజిక వ్యవస్థలపై ప్రభావం చూపింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడుగురు పిల్లల్లో ఒకరు కోవిడ్-19 లాక్‌డౌన్ కారణంగా మానసిక అనారోగ్యం బారిన పడినట్లు యూనిసెఫ్ తెలిపింది. ఈ సమయంలో 13 కోట్ల మందికి పైగా బాలల ఇంటికి పరిమితమవడంతో చాలా మంది మానసిక ఆందోళనకు గురైనట్లు తెలిపింది. ఇటీవల కాలంలో మనదేశ జనాభాలో దాదాపు 14 శాతం మందికి మరింత మెరుగైన మానసిక ఆరోగ్యం అవసరమని జాతీయ మానసిక ఆరోగ్య సర్వే తేల్చింది. మానసిక ఆరోగ్య పరిస్థితులు కారణంగా 2012-2030ల మధ్య ప్రపంచవ్యాప్తంగా 1.03 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం కలుగనుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది.

బాల్యంలో కొందరు తీవ్ర ఒత్తిడి, బాధామయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఇలాంటి అనుభవాలను చవిచూసినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. సుమారు ఆరుగురిలో ఒకరు నాలుగు, అంతకన్నా ఎక్కువ ఘటనలు ఎదుర్కొన్నవారేనని వివరిస్తున్నాయి. ఇలా ఎక్కువ సార్లు ఒత్తిడికి గురైతే పెద్దయ్యాక మధుమేహం, ఊబకాయం, పక్షవాతం వంటి సమస్యలు వచ్చే అవకాశముంటుంది. అంతే కాదు, ఆందోళన, కుంగుబాటు, మాదకద్రవ్యాల వ్యసనం వంటి మానసిక సమస్యల ముప్పు పెరుగుతుంది. తల్లిదండ్రుల సంరక్షణ,ఆప్యాయత, ప్రేమ కొరవడటమూ ఇందుకు దోహదం చేస్తుంది.బాల్యంలో సానుకూట ధోరణి పెంపొందటానికి పెద్దవాళ్ల తోడు చాలా ముఖ్యం. రోజువారీ ఎదురయ్యే ఒత్తిడికి గురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆత్మీయులు ఎవరైనా సరే, పిల్లలకు అండగా నిలవాలి. చిన్న పిల్లకేం సమస్యలుంటాయని తేలిగ్గా తీసుకోవద్దు. వారి ప్రతి కదలిక వెనుక ఏదో ఒక విషయం దాగి ఉంటుంది. చిన్నారులతో ఎంత ఎక్కవగా మాట్లాడితే అంతగా వారి హృదయాన్ని చదువగలుగుతాము. సమస్యను చెప్పినప్పుడు అది చిన్నగానే కనిపించవచ్చు, అలాగని దాన్ని వదిలేయకుండా ఆ సమస్యకు పరిష్కారం సూచించినప్పుడే వారి మనసు కుదుట పడుతుంది. వారి భావోద్వేగాలకు విలువనివ్వాలి. అదే స్థాయిలో ఆలోచించి పరిష్కారం చెప్పినట్లుగా ఉంటేనే వారికి తృప్తి కలుగుతుంది. అప్పుడే వారి ఆందోళన,ఒత్తిడి దూరమవుతుంది. అలాగే చిన్నారుల ఆలోచనా విధానంలో ఎంత స్పష్టత ఉందో గుర్తించాలి. సమస్యను చెప్పుకునే అవకాశమివ్వాలి. తమ బాధ,వేదనను చెబితే పెద్దవాళ్లు సానుకూలంగా తీసుకొని పరిష్కారం చెబుతారనే భరోసా పిల్లలకు దొరకాలి. తప్పు చేసినప్పుడు దండించినా,స్నేహితులుగానే మెలగాలి. అప్పుడే వారికి అమ్మ ఒడి లేదా నాన్న సాన్నిధ్యం భరోసాగా ఉంటుంది. అది సమస్యలను ఎదుర్కొనే ధైర్యాన్నిస్తుంది. వారికంటూ బలమైన వ్యక్తిత్వాన్ని ప్రోది చేసినప్పుడు చిన్న చిన్న సమస్యలకు ఆందోళన చెందడం మానేస్తారు. పోషకాహారం ఇవ్వడం, శారీరక శ్రమ కలిగించే ఆటలు, ఇతర వ్యాపకాలపై దృష్టి సారించేలా పిల్లలను ప్రోత్సహించడం వల్ల ఎలాంటి ఒత్తిడినైనా ఎదుర్కొనే మనోనిబ్బరాన్ని అలవర్చుకుంటారు.

**- కోడం పవన్ కుమార్**
9848992825

# నాటక రంగంలో విభిన్నశైలి 'థియోడరస్'

థియోడరస్ టెర్జోపోలోస్ 1947లో (78 సంవత్సరాలు) ఉత్తర గ్రీస్ దేశంలో పిరియా ప్రాంతంలోని మక్రిజియాలస్ అనే గ్రామంలో జన్మించాడు. ఏథెన్స్ లోని కోస్టిస్ మైఖేలిడిస్ స్కూల్ ఆఫ్ డ్రమెటిక్ ఆర్ట్స్ లోను, తర్వాత బెర్లినర్ ఎన్ సెంబుల్ లోను ఉన్నత విద్యను అభ్యసించి ప్రసిద్ధ జర్మన్ నాటక దర్శకుడు హీనర్ ముల్లర్ వద్ద సహాయ దర్శకుడిగా శిష్యరికం చేశాడు. అట్టిస్ థియేటర్ కంపెనీ వ్యవస్థాపక, కళాత్మక దర్శకుడుగా థియేటర్ ఒలింపిక్స్ ఉద్యమంలో కీలకమైన వ్యక్తి. ఇతడు ప్రధానంగా గ్రీకు పౌరాణిక రంగస్థల విషాదంత నాటకాలపై లోతుగా అధ్యయనం చేసిన విశేషమైన అనుభవంతో, ప్రాచీన గ్రీకు విషాదంతా రంగస్థలం నేపథ్యానికి విప్లవాత్మకమైన మార్పులు జోడించి ప్రదర్శించిన సృజన శీలి. ఈ రంగస్థల దార్శనికుడు తన సమన్వయ పూర్వక దృష్టితో మానవ భౌతిక జీవన విధానంతో సంప్రదాయ రీతులను మేళవించి కనిపించని అగాధపు లోతులను దర్శించి, తనదైన మార్గాన్ని ఎంచుకొని ఆ దిశగా వర్తమాన నాటక రంగాన్ని, ప్రత్యేకించి గ్రీకు నాటక రంగస్థలాన్ని నడిపిస్తున్నాడు.

గత నలభై ఏళ్లగా 2300 పైగా ప్రదర్శనలను అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించి,తన రంగస్థల నిర్మాణాత్మక కృషి ద్వారా ప్రపంచాన్ని మేలుకొలుపుతూ ఇప్పటి ప్రపంచ పోకడల పట్ల అప్రమత్తం కావాలంటున్నాడు. పర్యావరణ విధ్వంసం భౌతిక మౌలిక జీవావరణం విధ్వంసం పట్ల రంగస్థలం ద్వారా ప్రజల్ని చైతన్య పరచమంటున్నాడు. 'డైనీషియస్ తిరిగి రాకడ'నటన పద్ధతిగా పేరుపొంది, ఆంగిక, గాత్ర ప్రక్రియల ద్వారా నటనా శైలిని అభివృద్ధి పరిచినవాడు. ఈ పద్ధతిని 18 మధ్యధర దేశాలలోనూ, ప్రపంచవ్యాప్తంగా 30 నాటక అకాడమీల్లోనూ బోధనా, ఉపన్యాసాలను ప్రదర్శనలను నిర్వహిస్తున్న వాడు. తన రంగస్థలం

జీవిత కాలంలో లెక్కలేనన్ని గ్రీకు విషాదంతా నాటకాలను, ఓపెరాలను, వర్తమాన రంగస్థల ప్రదర్శనల ద్వారా సుసంపన్నం చేస్తున్న భాగ్య శాలి.

ఇందుకుగాను ప్రపంచ రంగస్థలం ఇతడిని ఎంతగానో గౌరవించి ఆదరణ పూర్వకంగా అంతర్జాతీయ సదస్సులు, అకాడమీలకు స్వాగతించి ఎమెరిటస్ ప్రొఫెసర్ హోదాలో సత్కరిస్తున్నది. ఇప్పుడు అతడి ఈ సంవత్సరపు రంగస్థలం సందేశ సారాంశాన్ని చూద్దాం.

'మనం నివసిస్తున్న ఈ ప్రపంచ- రక్షణ కోసం చేస్తున్న ఆర్తనాదం వినండి. మనం ఏం చేయగలమా? అన్న ఆ విషయాలను గురించి ఆలోచించి, ఆచరించండి. ఇప్పటి మనుషులు వర్చువల్ రియాలిటీ రోజుల్లో కూరుకుపోయి ఒకరికొకరు దూరంగా ఉంటున్నారు. మానవ పర్యావరణం ధ్వంసం కాబడి, మొత్తం మానవ, జీవావరణం నాశనం అవుతున్న హెచ్చరికలు చేస్తున్నది. సామాన్యుడి జీవనాన్ని రాజకీయ రంగం, మాధ్యమాలు, కార్పొరేట్ రంగం నియంత్రిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు మానవ సంబంధాల పట్ల భయాలు కలిగిస్తూ వేర్పాటుకు ఆజ్యం పోస్తున్నాయి. ఇటువంటి ఆత్యయిక పరిస్థితుల్లో నాటక రంగ తక్షణ కర్తవ్యం గురించి ఈ గ్రీకు నాటక రంగ నిపుణుడు ఇలా ఉద్బోధిస్తున్నాడు. 'సమాజంలో ప్రమాదకర స్థాయికి చేరుకున్న విపత్కర పరిస్థితులు మరింతగా ముదిరిపోకుండా చూడమంటున్నాడు. ఎంతో భౌగోళిక వైవిధ్యం ఉన్న మానవ జీవితాల మధ్య మంచి అవగాహన పెంచి సహానుభూతితో వ్యవహరించేలా చూడమంటున్నాడు. లోతుగా ఆలోచిస్తూ నైతిక బాధ్యతతో నడుచుకునేందుకు ప్రోత్సహించమంటున్నాడు టెర్జోపోలోస్. గ్రీకు దేవత డైనిషియస్.. జీవిత పరమార్థాన్ని, ఈ లోకంలో మానవ ప్రస్థానం గురించి ఇచ్చిన ప్రేరణతో ఆలోచించమంటున్నాడు. మానవ జీవితంలో సహజంగా ఉండే సంక్లిష్టతలతో కూడిన స్వభావాన్ని రంగస్థల వేదికలు తమ శక్తి ద్వారా ఈ పరిస్థితుల్లో మార్పు తెచ్చి మనుషుల్ని సమైక్యపరచాలి' అని కోరుకుంటున్నాడు.

ఈ ప్రపంచ రంగస్థల దినోత్సవ స్ఫూర్తితో డైనీషియస్ కళ్ళల్లోకి చూస్తూ మనల్ని మనం ఇలా ప్రశ్నించుకోమంటున్నాడు. ఏమిటి ఇదంతా? ఎందుకోసం? అని. రంగస్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ, గతాన్ని మర్చిపోకుండా నిర్మాణాత్మక ఆలోచనలను నూతన పంథాలో ఆచరిస్తూ, ప్రస్తుతం కమ్ముకున్న చీకట్లలోంచి వెలుగులోకి, సురక్షితమైన భవిష్యత్తులోకి ప్రయాణించమంటున్నాడు థియోడరస్ టెర్జో పోలోస్.

**(మార్చి 27 ప్రపంచ రంగస్థల దినోత్సవం)**

**- మల్లేశ్వరరావు ఆకుల**
79818 72655

# సి.వి. రామన్ గర్వించదగ్గ శాస్త్రవేత్త

జాతీయ విజ్ఞాన దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న భారతదేశంలో జరుపుకుంటారు. ఈ రోజును భారతదేశంలో ప్రముఖ భౌతికశాస్త్రజ్ఞుడు సి.వి రామన్ చేసిన శాస్త్రీయ పరిశోధనకు గుర్తింపుగా ప్రారంభించారు. 1928 ఫిబ్రవరి 28న ఆయన చేసిన రామన్ ప్రభావం (రామన్ ఎఫెక్ట్ )అనేది అద్భుతమైన శాస్త్రీయ ఆవిష్కరణ. ఇది ఆయనకు 1930లో నోబెల్ ప్రైజ్‌ను సంపాదించిపెట్టింది. జాతీయ విజ్ఞాన దినోత్సవం ఈ శాస్త్రీయ ఆవిష్కరణను స్మరించడమే కాకుండా శాస్త్రీయ జ్ఞానాన్ని ప్రోత్సహించటానికి, యువతలో శాస్త్రం మరియు సాంకేతికతపై ఆసక్తిని పెంచడానికీ ఉద్దేశించినది. ఇక్కడ జాతీయ విజ్ఞాన దినోత్సవం యొక్క ఇతిహాసం, ప్రాధాన్యత మరియు ముఖ్యమైన సంఘటనలను పరిశీలిస్తే సి.వి రామన్ రామన్ ప్రభావం (రామన్ ఎఫెక్ట్ ) ఆవిష్కరణకు సంబంధించినది. 1888 నవంబర్ 7న తమిళనాడు రాష్ట్రంలోని తిరుచిరాపల్లి పట్టణంలో జన్మించిన చంద్రశేఖర వెంకట రామన్ ఒక ప్రముఖ భౌతిక శాస్త్రజ్ఞుడు. వెలుగును బట్టి చేసిన ఆయన పరిశోధన వల్ల రామన్ ప్రభావం కనుగొనబడింది. ఇది వెలుతురు లేదా కిరణాలు ఒక పారదర్శక పదార్థం ద్వారా వ్యాప్తి చేయబడినప్పుడు దాని తరంగదైర్ఘ్యం మారుతుందన్న క్రాంప్టన్ ఆలోచనను ఋజువుచేసాడు.స్పెక్ట్రోస్కోపీని పరివర్తన చేస్తూ, పరిమాణ జీవజాలం, రసాయనశాస్త్రం మరియు పదార్థ శాస్త్రం వంటి రంగాల్లో అనేక ఉపయోగాలను తెచ్చిపెట్టింది ఈ ప్రయోగ ఆవిష్కరణ.



ఈ రోజు ప్రధానంగా శాస్త్రీయ ప్రగతి, పరిశోధన మరియు దైనందిన జీవితంలో శాస్త్రం యొక్క ప్రాధాన్యతను ప్రచారం చేయడంలో భాగంగా జరుగుతుంది . వాటిలో భారతదేశంలోని శాస్త్రీయ సామర్థ్యాలను మరియు ప్రపంచ శాస్త్రీయ సమాజాన్ని ముందుకు నడిపించడం, పెంపొందించడం. జాతీయ విజ్ఞాన దినోత్సవం విద్యార్థులకు శాస్త్రం మీద ఆసక్తిని పెంచుతుంది, వారిలో శాస్త్రీయ జ్ఞానం మరియు సాంకేతికతపై ఆసక్తి పెరిగేందుకు ఉద్దేశిస్తుంది. ఈ రోజు రామన్ ప్రభావం వంటి పూర్వకాల కృషులతో పాటు, పర్యావరణ శాస్త్రం, వైద్యశాస్త్రం మరియు స్పేస్ శాస్త్రం వంటి రంగాలలోని ప్రస్తుత శాస్త్రీయ పరిశోధనలను ప్రదర్శించడం. ప్రజలకు అవగాహన పెంచడం శాస్త్రం ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందో, ఆరోగ్య, వ్యవసాయం, సాంకేతికత, విద్య, తదితర రంగాలలో శాస్త్రం యొక్క ప్రయోజనాల గురించి అవగాహన పెంచడం. భవిష్యత్తు శాస్త్రజ్ఞులను ప్రేరేపించడం,ఈ రోజు యువతను శాస్త్రీయ పరిశోధనలలో ప్రవేశపెట్టేందుకు, అన్వేషణ మరియు అభివృద్ధి ప్రయోజనాలను అంగీకరించేలా ప్రేరేపిస్తుంది.

ప్రతి సంవత్సరం జాతీయ విజ్ఞాన దినోత్సవం ప్రత్యేక థీమ్‌తో జరుపుకుంటారు, ఇది శాస్త్రీయ పరిశోధన మరియు అభివృద్ధి ముఖ్యమైన అంశాలను ప్రదర్శిస్తుంది. ఈ థీమ్‌లు పరిశోధనలో ఎదురయ్యే సవాళ్లను, అవకాశాలను, మరియు శాస్త్రీయ పరిష్కారాలను కేంద్రీకరించడానికి ఉపయోగపడతాయి.

2024 థీమ్: 'ప్రపంచ శాస్త్రం, ప్రపంచ సంక్షేమం',2023 థీమ్: 'స్థిరమైన భవిష్యత్తు కోసం సమగ్ర దృష్టికోణం'2022 థీమ్: 'స్థిరమైన అభివృద్ధి కోసం శాస్త్రం', 2021 థీమ్: 'శాస్త్రీయ మరియు సాంకేతిక పరిజ్ఞానం: విద్య, నైపుణ్యాలు మరియు ఉద్యోగాలపై ప్రభావం' జాతీయ విజ్ఞాన దినోత్సవంలో ముఖ్యమైన సంఘటనలు.

శాస్త్రీయ ప్రదర్శనలు మరియు పోటీలు ఈ రోజున వివిధ శాస్త్రీయ ప్రదర్శనలు, సదస్సులు మరియు వర్క్‌షాప్‌లు దేశవ్యాప్తంగా జరుగుతాయి. విద్యాసంస్థలు సైన్స్ క్విజ్లు, డిబేట్లు నిర్వహిస్తాయి, తద్వారా విద్యార్థులలో శాస్త్రంపై దృఢమైన అవగాహన పెరుగుతుంది. భారతదేశం అనేక రంగాల్లో, ముఖ్యంగా స్పేస్, పునరుత్పత్తి శక్తి, వైద్య శాస్త్రం, వ్యవసాయ శాస్త్రం, మరియు సమాచార సాంకేతికత వంటి రంగాలలో అద్భుతమైన పురోగతి సాధించింది. జాతీయ విజ్ఞాన దినోత్సవం ఈ విజయాలను గుర్తించడమే కాకుండా, భవిష్యత్తులో శాస్త్రీయ పరిష్కారాలు అందించే అవకాశాలపై దృష్టి పెడుతుంది.

జాతీయ విజ్ఞాన దినోత్సవం ఒక స్మరణార్థం కాదు. ఇది శాస్త్రం మరియు సాంకేతికత యొక్క ప్రాధాన్యతను గుర్తించడంలో కీలకమైన రోజు. ఇది శాస్త్రీయ దృష్టిని పెంచుతూ, యువతలో పరిశోధన, విజ్ఞానం, మరియు అన్వేషణ మీద ఆసక్తి పెంచడానికి దోహదపడుతుంది. శాస్త్రోత్పత్తికి ఉపయోగపడుతుంది.

**- ఎల్. ఉపేందర్**

## వర్ణాక్షరం

ఒక హృదయానికి అక్షరం దొరికింది
ఒక మనసుకు వర్ణదృశ్యం దొరికింది
హృదయం,మనసు ఆకారం తొడిగితే శీలావీ.
కవిత మోహితమై రంగుల చిత్రమాయెనో
బొమ్మ ఊరించిన కవిత్వ మాయెనో
వెంటాడే ఆశ్చర్యం.
ఆకాశమంతా నవవర్ణ మాలికలై
నేలంతా పులకించిన పడుగు పేకల జీవన
మొలకలై
విస్తరిల్లిన ప్రపుల్లత, పరిపూర్ణత.
పాత్రల వెనక మాతృస్త్రీ మార్దవ స్పర్శ
కథల్లో నవలల్లో ప్రయోగవాద కవితా స్పృహ
దాహం తీరని కొత్తదనపు, కొత్తందపు సాహిత్య,
చిత్రాల సామ్రాజ్యం.
ప్రతిపొద్దుకు సూర్యుడు ఒక్కడే అన్నట్లు,
వచన కవిత ఎవ్వరిదైనా
అట్ట మీద ఆ కుంచెనే సోయగాలు పోయిన
రోజులు ఎప్పటికైనా ఎవ్వరికైనా
తాజా ఉద్వేగభరితమే
శాంత స్వభావ మనఃహ్లాదినీ! బతుకు బాటలో
కాసు ఆసు
రాకపోకల మధ్య నెమ్మదనమే కమ్మదనం చిందె.
సహానుభూతికి, సహాయానుభూతి జోడింపు
లెక్కలేసుకోని బోళాతనం
భళాతనమే.
కవికీ చిత్రకారునికీ సౌందర్యారాధన మూడోకన్ను.
ప్రకృతీ జీవితమూ చిప్పిల్లే రసాస్వాదనమే.
రాసిందీ గీసిందీ కలానికి కుంచెకి అటూ ఇటూ
మాత్రమేనా?
ఉదయాస్తమయాలూ, ఊపిరి శబ్దాలూ
ఊరేగునంత వరకూ ఆకాశ దీపం నీడలోనూ
అవి తోవ జూపిస్తయి.
అవునూ! నా తొట్టతొలి గోరుకొయ్యలు కవరు
పేజిలో రైతు ఆకసం వంక తలెత్తి చూస్తూ,
పొలానికి సిద్ధమైతడు.
ఇప్పుడు మీరక్కడ వున్నారు!

**- దాసరాజు రామారావు**

# సర్వాయి పాపన్న స్ఫూర్తి కావాలి

350 ఏళ్ల క్రితమే పాపన్న బహుజన జాతులను ఏకం చేసి తెలంగాణలో రాజ్యాధికారాన్ని హస్త గతం చేసుకొని అగ్రవర్ణ జమీందారుల గడిల దొరలను గడగడ లాడించి 21 కోటలు అక్రమించాడు. ఖిల షాపూర్ నుండి మొదలు పెట్టి తాటికొండ,వేములకొండ,భువనగిరి, కొలనుపాక, జాఫర్‌గఢ్, చేర్యాల్, భైరన్‌పల్లి, సర్వాయిపేట,వరంగల్, హుస్నాబాద్, హుజురాబాద్, కరీంనగర్, జనగామ, నల్గొండ ప్రాంతాలలో తన రాజ్యాన్ని విస్తరించి పరిపాల సాగించిన గొప్ప బహుజన చక్రవర్తి. 1650 ఆగస్టు 18న ధర్మన్న, సర్వాయమ్మ పుణ్య దంపతులకు జన్మించాడు. యుక్త వయస్సుకు రాగానే గౌడ కులంలో పుట్టిన పాపన్న తన కులవృతి అయిన తాళ్లు ఎక్కుతూ కల్లు అమ్ముతూ కల్లు మండవలో తన స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, దూదేకుల మీర్ సాహెబ్, కొత్వాల్ కు కల్లు పోస్తూ అందరితో కలివిడిగా ఉండేవాడు. గోల్కొండ నవాబు తురుష్క సైనికులు గ్రామాలలో శిస్తు వసూలు చేసుకొని గుర్రాలపై అటుగా వెళుతు పాపన్నను కల్లు పోయమని అడుగగా తురుష్క సైనికులకు తాటి చెట్టు ఎక్కి కల్లు పోస్తాడు. కల్లు తాగిన సైనికులు డబ్బులు ఇవ్వకుండా పోతుంటే పాపన్న స్నేహితులు కల్లు తాగిన పైకం కట్టాలని అడుగుతే తురుష్క సైనికులు మేము రాజుగారి సైనికులం మమ్మలనే అడుగుతారా అని పాపన్న స్నేహితులపై చేయి చేస్తుకుంటారు. అది సహించలేని పాపన్న కోపంతో ఉగ్రరూపుడై వారితో యుద్ధం చేసి కల్లు గీసే కత్తితో కొందరిని చంపుతాడు. కొందరు చావుభయంతో పారిపోయి గోల్కొండ నవాబుతో జరిగిన సంఘటన చెబుతారు. అలా పాపన్న రాజ్యధికారం వైపు అడుగులు పడ్డాయి. అప్పుడే తన మనసులో మెదిలిన మాట 'తాల్లేక్కుతే ఏమోస్తది కల్లు అమ్ముతే ఏమోస్తది కొడితే గోల్కొండను కొట్టాలే రాజుగా రాజ్య పరిపాలన చేయాలే నా బహుజన జాతులకు న్యాయం చేయాలే'అనే ఆలోచనతో వివిధ కులాలకు సంబంధించిన తన స్నేహితులు 12 మందితో సైన్యాన్ని తయారు చేసుకొని వారికి యుద్ధ విద్యలు నేర్పి వారిని కూడా నాయకులుగా తయారు చేసి తన తల్లి దగ్గరున్న బంగారు నగలు అమ్మి ఆయుధాలు సమకూర్చుకొని ఇప్పుడున్న కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సర్వాయి పేట దగ్గర నాలుగు వేల ఎకరాల కొమ్ముగుట్టను

స్థావరంగా చేసుకొని మూడు వేల మంది సైన్యాన్ని తయారు చేశాడు. వారందరికీ గెరిల్లా శిక్షణ ఇచ్చి యుద్ధ వీరులుగా తీర్చిదిద్దాడు. గడిల దొరల దగ్గర ధనం రాత్రికి రాత్రి కొల్లగొట్టి నిరుపేదలకు పంచెవాడు. అది తట్టుకోలేని జమీందారులు గడిల దొరలు పాపన్నను బందిపోటు దొంగగా చిత్రీకరించారు. పాపన్న తన సైన్యాన్ని క్రమక్రమంగా పన్నెండు వేలకు పెంచి గడీలు అక్రమించికుంటూ 21 కోట గడీలు ఆక్రమించుకొని 20 సంవత్సరాలు పరిపాలించి ఏకంగా గోల్కొండ పై దండయాత్ర చేసి 7 నెలలు పరిపాలించాడు. అణగారిన గౌడ కులంలో పుట్టిన పాపన్న చరిత్రను బ్రామ్మణ వాదులు అగ్రవర్ణాలు ఎక్కడ కూడా రాయటానికి ఇష్ట పడలేదు .సంచారజాతి శారదా గాళ్ల బుర్ర కథలతో కొంత బ్రతికి బట్టకట్టింది. అందుకే చరిత్రలో పాపన్నకు ఒక పేజీ అంటు లేకుండా పోయింది. పాపన్న స్వతంత్ర రాజ్యపాలనను సహించలేని జమిందారులు, గోల్కొండ నవాబులు, మొగల్ చక్రవర్తుల సహకారంతో తన సమీపబంధువు ఒక గుంట నక్క ఇచ్చిన సమాచారంతో పాపన్నను 1709 లో హుస్నాబాద్ ప్రాంతంలో మొఘల్ సైన్యాలతో యుద్ధం చేసి వీరోచితంగా పోరాడి చివరికి వారి చేతిలో చిక్కేకంటే తనకుతానే బాకుతో పొడుచుకుని వీరమరణం పొందుతాడు. వీరమరణం పొందిన పాపన్న తలను గోల్కొండ నవాబుల సైన్యాలు మొగల్ సైన్యాలు తీసుకుపోయి గోల్కొండ కోట ముఖ ద్వారానికి వేలాడ కడుతారు. పాపన్న ఎల్లమ్మ తల్లికి పరమ భక్తుడు. హుస్నాబాద్ ఎల్లమ్మతల్లి దేవాలయం పాపన్న కట్టించిందే. నేటికి హుస్నాబాద్‌లో ఉంది. కూలిపోతున్న పాపన్న కోటలు సంరక్షించి బావి తరాలకు అందించి జనగామ జిల్లాకు పాపన్న పెరు పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ట్యాంక్ బండ్‌పై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రతిష్టించి రాబోయే తరాలకు సర్వాయి పాపన్నగౌడ్‌ను స్మరించేలా ఆలోచనలు చేయాలి. పాపన్న వారసత్వం ను పుణికి పుచ్చుకుని గౌడ్ యువత విద్య,వాణిజ్య,వ్యాపార వివిధ రంగాల్లో తమదైన ముద్రను చాటిచెప్పే విధంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలి. గౌడ కులస్థులు రాజకీయ,సామాజిక,ఆర్థిక అంశాలలో విలక్షణమైన కార్యాచరణతో సమిష్టి నాయకత్వంలో అందరూ సంఘటితంగా మారి ఒక శక్తిగా, అందరిని ఆదరించే యుక్తిగా ఎదగలసిన అవసరం ఉంది.

**- బండి. వంశీకృష్ణ గౌడ్**
9550837962

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు. - ఎడిటర్

## ఏడో రుచి



నుదురుపై అమ్మ
ముద్దు బువ్వ పెట్టింది
బతుకు కలకండైపోయింది...
ఎదురు చూపుల చివర
ఆమె ఎడబాటు వాక్యం రాసింది

# మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● టీడీపీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి

**మంత్రాలయం, మార్చి 26(మనం న్యూస్)** : రాష్ట్ర చరిత్రలో మొదటి సారి మీ కోసం - ప్రజాసమస్యల పరిష్కార వేదిక ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో ఆయన మాట్లాడుతూ, మంత్రాలయం ప్రజలు మారు మూల గ్రామాల నుండి వచ్చి అధికారులకు తమ సమస్యలపై అర్జీలను ఇచ్చేందుకు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు అని తెలుసుకొని అర్జీ దారుడు ఇచ్చిన అర్జీని పరిష్కరించవలసిన అధికారికి పంపిన తరువాత 7 రోజుల నుండి 10 రోజుల లోపు ఆయా అర్జీ లని వారు పరిష్కరించుటకు 3 నెలలు నుండి 6 నెలల సమయం పడుతున్నదని అర్జీదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదే పదే తిరుగుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ వారికి ఇబ్బంది కలగకూడదు అని సీఎం నారా చంద్రబాబు నాయుడు అదేశాల మేరకు ప్రజా సమస్యలను అధికారులు తెలుసుకొనుట మరియు పరిష్కరించుటలో సమస్యగా ఉన్న ఈ పద్ధతిని మార్చుటకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కరించబడాలి అంటూ మరియు ప్రజా సమస్యల పై ప్రభుత్వ అధికారులకు బాధ్యత పెరుగాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మొదటి సారిగా రాష్ట్ర స్థాయి నుండి మండల స్థాయి మరియు గ్రామ స్థాయి అధికారుల వరకు అనుసంధానం చేస్తూ ప్రజల నుండి స్వీకరించే అర్జీలను ఆన్ లైనులో కంప్యూటరీకరించే

కార్యక్రమమైన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ' మీకోసం ' ఏర్పాటుచేసి ప్రజల నుండి వచ్చే అర్జీ వివరములు, వాటి స్థితి మరియు పరిష్కార వివరములు సంక్షిప్త సందేశాలు మరియు ఆన్ లైన్ ద్వారా తెలుసుకొని సత్వర పరిష్కారం నిర్వహించడం లో కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందని మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ ప్రజా సమస్యలు తెల్సుకొని వాటిని పరిష్కరించే విధంగా ప్రజా వేదికగా ముందుకుపోతున్నా అంటూ మీడియా వేదికగా ప్రజలకు తెలియచేయడం జరిగింది.

## గిరిజనులకు పక్కా గృహాలు నిర్మించాలి

● గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**జూపాడుబంగ్లా మార్చి 26 (మనం న్యూస్)**ః జూపాడు బంగ్లా మండలంలోని సిద్దేశ్వరం 80 బన్నూర్ గ్రామ గిరిజనులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని ఇళ్ల స్థలాలు కేటాయించాలని, సిసి రోడ్లు వేయాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం. రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. బుధవారం మండలంలోని సిద్దేశ్వరం, రామసముద్రం, తరిగోపుల గ్రామాల్లోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం లోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో గిరిజనులు, ప్రజలు పక్కా గృహాలు లేక పూరి గుడిషెల్లో నివసిస్తున్నారని వారన్నారు..మౌలిక సదుపాయాలు కల్పించడం లో నిర్లక్ష్యం చేస్తున్నారని వారు అన్నారు.. రామసముద్రం గ్రామంలో సచివాలయ ఉద్యోగుల పర్యవేక్షణ ఏమాత్రం లేదని నెలకు ఒకసారి కూడా ఆ గ్రామాన్ని సందర్శించిన పరిస్థితి లేదన్నారు. రామ సముద్రం గ్రామంలో దళిత కాలనీ వాసులకు త్రాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. ప్రత్యేక బోరు ఏర్పాటు చేసి నీరు అందించాలన్నారు.. సిద్దేశ్వరం గ్రామం లో ఒక్క సిసి రోడ్డు కూడా లేదన్నారు. తరిగోపుల గ్రామం లో పెండింగ్ లో ఉన్న సాయిబాబా దేవాలయం నుండి కేసి కెనాల్ బ్రిడ్జి వరకు రోడ్డు వేయాలన్నారు.రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై ఆందోళన నిర్వహిస్తమన్నారు.

ఈ కార్యక్రమం లో సీపీఐ మండల నాయకులు నరసింహ, శ్రీను, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 28న 'మీ సమస్య – మా పరిష్కారం'

● ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు కొత్త కార్యక్రమం చేపట్టిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్

**కర్నూలు మార్చి 26(మనం న్యూస్)**ః కర్నూలు నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈనెల 28వ తేదీన 'మీ సమస్య - మా పరిష్కారం' అనే కార్యక్రమాన్ని మంత్రి టీజీ భరత్ ప్రారంభించనున్నారు. కర్నూలు నియోజకవర్గానికి చెందిన ప్రజలందరూ 'మీ సమస్య - మా పరిష్కారం' కార్యక్రమానికి వచ్చి సమస్యలు తెలియజేయవచ్చని మంత్రి టీజీ భరత్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రి కార్యాలయంలోని శ్రీ ఆర్య ఫంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. కావున కర్నూలు నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం ప్రకటనలో కోరింది.

## మంత్రాలయం పంచాయతీకి రూ. 1.85 లక్షల ఆదాయం

**మంత్రాలయం , మార్చి 26, (మనం న్యూస్ )** : మంత్రాలయం మేజర్ గ్రామ పంచాయతీ లో వారపు సంత మార్కెట్ , దినసరి మార్కెట్ లో నిర్వహించిన వేలం పాట ద్వారా రూ. 1,85,500 ఆదాయం వచ్చినట్లు మంత్రాలయం గ్రామ పంచాయతీ సెక్రటరీ నాగరాజు తెలిపారు . బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు.

గత సంవత్సరం ఈ వారపు సంత వేలం పాటలో రూ. 49వేలు కాగా, ప్రస్తుత ఈ సంవత్సరం వారపు సంత వేలం రూ. 65, 500లకు యం నరసయ్య చేజిక్కించుకున్నారు. అలాగే గత సంవత్సరం దినసరి మార్కెట్ వేలం రూ. 93 వేలు కాగా

ఈ సంవత్సరం రూ. 1.20 లక్షల వేలం పాటను ఆర్ సాల్మన్ చేజిక్కించుకునట్లు పంచాయతీ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఆర్డీఓ ప్రభావతి , ఉప సర్పంచ్ పరమేష్ స్వామి , అధికారులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యపై సమగ్ర విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలి

● మాజీ మంత్రి మూలింటి మారెప్ప డిమాండ్

**కర్నూల్ మార్చి 26 (మనం న్యూస్)**: ఆంధ్రప్రదేశ్ లో మతోన్మాద రాజకీయాలు చేస్తున్న సంఘ విద్రోహ శక్తులను కట్టడి చేయాలి.అన్ని మతాల ప్రజలు రాజ్యాంగము ఇచ్చిన మతస్వేచ్ఛ హక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకునే ప్రజాస్వామ్య బద్ధంగా వాతావరణం కల్పించాలి. సమాజంలో మత సామరస్యం, సహోదర భావం పెంపొందించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు కృషి చేయాలి. ఇలానే కొనసాగితే జాతుల మధ్య కులాల మధ్య మతాల మధ్య అంతర్యుద్ధం జరిగే ప్రమాదం కూడా ఏర్పడతాయని విషయాన్ని గుర్తించుకోవాలి. పాస్టర్స్ శాంతికి చిహ్నంగా దేవుని కొరకు నిర్భయముగా నిలబడి సువార్తను ధైర్యంగా ప్రజల మధ్య ప్రకటిస్తూ బోధిస్తూ దేవుని ఎదుట తన ప్రవర్తనను విశ్వాసమును కాపాడుకొని ప్రభువు నందు విశ్వాసంతో ప్రజల మధ్య సఖ్యతకు ఐక్యతకు నిరంతరం కృషి చేస్తున్నటువంటి పాస్టర్ను విజయవాడ నుండి వస్తుండగా కొవ్వూరు దాటిన తర్వాత చంపివేసి అతి దారుణంగా ఒళ్లంతా గాయాలు పరిచి యాక్సిడెంట్ గా చిత్రీకరించడం చాలా దుర్మార్గమైనది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హోం మంత్రి వంగలపూడి అనిత గజూ డిజిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను. అదేవిధంగా పాస్టర్ ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు బంధువులకు ధైర్యాన్ని ఇవ్వమని దేవుని ప్రార్థిస్తున్నాను.

## నాయకుల కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తాం

● డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

**బేతంచేర్ల, మార్చి 26(మనంన్యూస్)**ః పట్టణంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ మండల పట్టణ నాయకుల కార్యకర్తతో సమావేశం నికి డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు సమావేశంలో పట్టణ మండల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తో తెలుగు తమ్ముళ్లు ఆవేదనే వ్యక్తపరిచారు గత వైసీపీ ప్రభుత్వంలో మాపై కేసులు పెట్టారని తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ఎన్నో కష్టాలు పడ్డామని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినాక కష్టపడ్డ నిజమైన తెలుగుదేశం నాయకులను కార్యకర్తలను గుర్తించడం లేదని పోలూరు రాఘవరెడ్డి ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కి తెలిపారు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వైసీపీ నాయకుల హవా నడుస్తుందని కొందరు టిడిపి నాయకులు వైసీపీ నాయకులను పెట్టుకుని వైసీపీ వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నారని ప్రతి గ్రామం నుండి వచ్చిన తెలుగు నాయకులు కార్యకర్తలు ఆవేదన వ్యక్తపరిచారు మండలంలో సమస్యల పరిష్కారం కోసం మండల టిడిపి నాయకుడి ని పెట్టాలని అంబాపురం శ్రీనివాసులు తెలుపగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో నాయకుల కార్యకర్తల సమస్యలు నేనే పరిష్కరిస్తాను అన్నారు మా కుటుంబానికి కులమతాలు లేవని ఎస్సీలైన బీసీలైన అందరిని ఆదరిస్తామని గతంలో వైసిపి ప్రభుత్వం టిడిపి నాయకుల కార్యకర్తల పై అక్రమకేసులు చిత్రహింసలు పెట్టారని ప్రతి గ్రామంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు ఇబ్బంది గురయ్యారని అన్నారు పట్టణ మండలంలో తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం నాయకులు కార్యకర్తలు నన్ను గెలిపించారని మీ సమస్యలు నా దృష్టికి తెస్తే మీ సమస్యలు పరిష్కరిస్తానని తెలుగుదేశం పార్టీ నాయకులు వైసిపి నాయకుల ను పెట్టుకొని హవా నడిపిస్తే వారి పైన చర్యలు తప్పవని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఒక కుటుంబంల ఉండాలని అన్నారు సమావేశంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఉన్నాం ఎల్లా నాగయ్య గౌరి రామి రెడ్డి సోమశేఖర్ రెడ్డి పోలూరు రాఘవరెడ్డి పోలూరు శ్రీనివాస్ రెడ్డి బుగ్గన ప్రసన్న లక్ష్మి బుగ్గన ఆనంద్ రెడ్డి పాల శేఖర్ భీమేష్ రెడ్డి మండల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతుల సహకారంతో సంఘాన్ని అభివృద్ధి పరుస్తాం

● చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి

**సైదాపూర్, మార్చి 26 ( మనం న్యూస్ )**ః వెన్నంపల్లి విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ సహకార సంఘం సింగిల్ విండో చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన(మహాజన )సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 2024- 25 సంవత్సరం వార్షిక నివేదికను సంఘ సీఈవో చేల్మెలా మల్లారెడ్డి లావాదేవీలు చదివి వినిపించడం జరిగింది. అనంతరం చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సహకారంతోనే సంఘాన్ని మరింత అభివృద్ధి పరస్తామని, సహకార సంఘం ఆవరణంలో బోర్ వెల్, ప్రహరీ గోడ నిర్మాణం పొడిగిస్తామని పాత సహకార సంఘ భవనాన్ని శిథిలవస్తుగా ఉన్నందున మరమ్మత్తులు చేయిస్తామని,లస్మన్నపల్లి లో వరికల్లాలకు ఏర్పాటు చేస్తామని, సిఎస్సి సెంటర్, డిజిటల్ బ్యాంకు సేవలు అందిస్తామని, రైతుల సహకారంతో సీడ్ మిల్, సంఘం తరపున భూమి కొనుగోలు చేస్తామని రైతులు మీ యొక్క సలహాలు సూచనలు ఇవ్వాలని, మా పదవి కాలం ఆరు నెలలకు పొడిగించడం పొడిగించినందున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండేటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సారబుడ్ల రాజి రెడ్డి, ఆడిటర్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు దొనపాటి రామ్ రెడ్డి, మోలుగురి సంపత్, మొలుగూరి సౌందర్య, వెంగళ కోమల, గొడ గాని మోహన్ రావు, తడవేణి కనుకయ్య, గడ్డం అబ్బయ్య,పాల్గొన్నారు.

## కె.వి.ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

**కర్నూల్ మార్చి 26 (మనం న్యూస్)** : యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాడు కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో కరాటే బిల్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు ఈ టెస్టుల్లో 18 మంది విద్యార్థినీలు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ కట్టా. వెంకటేశ్వర్లు కెవిఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎస్. కుమార్ విచ్చేసి మాట్లాడుతూ మహిళలకు

ఈ రోజుల్లో కరాటే ఉషూ లాంటి మార్షల్ ఆరట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మ రక్షణ కొరకు మరియు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని అన్నారు. అనంతరం బ్లాక్ బెల్ట్ అండ్ బ్రౌన్ బెల్ట్ లు సాధించిన విద్యార్థినిలకు బెల్టులను సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.

కె కృష్ణవేణి, బి సుహాసిని, ఎస్ సుస్మిత, సి మహేశ్వరి, జి అఖిల, యు లావణ్య, బి అఖిల, కే అంజలి, ఎన్ రమాదేవిలు బ్లాక్ బెల్ట్ సాధించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవికారాణి, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్చార్జి డాక్టర్ కె విష్ణువందన, లెక్చరర్ పి మౌనిక పాల్గొన్నారు అని మాస్టర్ టి శ్రీనివాసులు తెలిపారు.

## రాజన్నను దర్శించుకున్న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు

**వేములవాడ,మార్చి 26 (మనం న్యూస్)**ః దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని బుధవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్, సభ్యులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ ఈఓ వినోద్ వారికి ప్రసాదం అందజేశారు.చైర్మన్, సభ్యులను ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు.వారి వెంట బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు, అధికారులు తదితరులు ఉన్నారు.

## ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**బేతంచేర్ల, మార్చి 26(మనం న్యూస్)**ః పట్టణంలో శేషారెడ్డి పీహెచ్ సి వైద్యశాలలో మాజీ ఎంపీటీసీ బుగ్గన ప్రభాకర్ రెడ్డి తనసొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు వైద్యశాలలో రోగులకు పళ్ళు బెడ్లు పంపిణీ చేశారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసిన బుగ్గన ప్రభాకర్ రెడ్డిని అభినందించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్లు బుగ్గన ఆనంద రెడ్డి నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ ఎంపీడీవో ఫజుల్ రెహమాన్ టిడిపి నాయకులు ఉన్నం ఎల్లనాగయ్య గౌరు రాంరెడ్డి భీమేష్ రెడ్డి జనసేన నాయకులు శ్రీ కంటి మధు పోల మధు ఎర్రం మనోజ్ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హోమ్ లో మొబైల్ అల్ట్రా సౌండ్ మెషిన్ సీజ్

**హైదరాబాద్,మార్చి26( మనంన్యూస్)**ః శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హోమ్ హాస్పిటల్లో అనధికారికంగా రిజిస్టర్డ్ కానీ మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను కనుగొని రెవెన్యూ, పోలీస్ శాఖ ఏ ఎస్ ఐ తో కూడిన స్పెషల్ డ్రైవ్ తనిఖీ బందంజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఫెర్టిలిటీ కేంద్రాల స్పెషల్ డ్రైవ్ టీం తనిఖీలలోభాగంగా హాస్పిటల్ కి నోటీసులిచ్చి మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను సీజ్ చే శారు. అదేవిధంగా హాస్పిటల్లో స్కానింగ్ కొరకు వచ్చే పేషెంట్లు వివరాలతో కూడిన ఫామ్ ఎఫ్ ఫారం ను పూర్తి పూర్తి చేసి ఏ రోజుకు ఆ రోజు ఆన్లైన్లో అప్డేట్ చేస్తున్న విధానాన్ని, అవుట్ పేషెంట్ రిజిస్టర్ లు, పి.సి.పి.ఎన్.డి.టి జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, అందులో పని చేస్తున్న డాక్టర్స్ క్వాలిఫికేషన్ వెరిఫికేషన్, గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం - 1994 మరియు రూల్స్ 1996 అమలవుతున్న తీరు, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడూ స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్ట ప్రకారం మూడు సంవత్సరాల వరకు జైల్ శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించబడుతుందని తెలిపారు. బోర్డులు ప్రదర్శిస్తున్నారా లేదా స్కాన్నింగ్ కేంద్రాలలో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతి నెల జరిగే స్కానింగ్ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపిస్తున్న తీరు, లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని చెప్పకూడదని బోర్డులు స్కానింగ్ కేంద్రాలలో ప్రదర్శించడాన్ని తనిఖీ చే శారు. ఈ స్కానింగ్ కేంద్రల, ఫెర్టిలిటీ కేంద్రాల యొక్క తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ వెంకటరమణ తెలిపారు.ఈ స్పెషల్ డ్రైవ్ తనిఖీ లో మొబైల్ అల్ట్రా సౌండ్ మిషన్ సీజ్ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాములు ,జూనియర్ అసిస్టెంట్ బాపు దేవ్ , ఏ.యస్.ఐ. విజయమణి , పి.ఓ.,డి.టి.టి. డా. ఉమాశ్రీ, పి.సి.పి.ఎన్.డి.టి ప్రోగ్రామ్ అధికారి, డా. సనా జవేరియా , సఖి కన్సల్టెంట్, డి. లక్ష్మి, డాటా ఎంట్రీ ఆఫరేటర్, కె. రమేశ్, డెమో, రాజగోపాల్, సుపెర్వైజర్ సయ్యద్ సబీర్ పాల్గొన్నారు.

## ఆన్లైన్ బెట్టింగ్ ల పై సర్కార్ ఉక్కుపాదం

● సిట్ ఏర్పాటు నిర్ణయంపై ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి హర్షం

**హైదరాబాద్, మార్చి26( మనంన్యూస్)** : యువకుల ప్రాణాలు తీస్తున్న ఆన్లైన్ బెట్టింగ్ ల పైఉక్కుపాదం మోపేందుకు

సిట్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మిగితా రాష్ట్రాల్లోనూ ఆన్లయిన్ బెట్టింగ్ వల్ల ఎంతోమంది యువకులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని డాక్టర్ కవ్వంపల్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్లయిన్ బెట్టింగ్ లతో మరణిస్తున్న సంఘటనలు రోజురోజుకు వెలుగు చూసుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆన్లయిన్ బెట్టింగ్ లు, గేమింగ్, రమ్మీ కేసులపై చర్యలకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లుగా అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రకటన చేయడం సంతోషకరమని కవ్వంపల్లి పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్లు, ఆన్లైన్ బెట్టింగ్లపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సరదాగా మొదలైన ఈ

బెట్టింగులు వ్యసనంగా మారి ప్రాణాలను బలిగొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఉచ్చులోంచి బయట పడలేక, అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. యువత, విద్యార్థులు పనులు మానేసి గంటల తరబడి ఆన్లైన్ గేమ్లు ఆడుతున్నారని, ఒక్కోసారి సహనం కోల్పోయి గొడవలకు దిగుతున్న సంఘటనలు కూడా లేకపోలేదని, వీటి నిరోధానికి పోలీసు నిఘా పెంచాల్సిన అవసరం ఉందన్నారు.బెట్టింగ్ నేరస్తులపైననే కాకుండా ఆన్లయిన్ బెట్టింగ్ యాప్ ను ప్రమోట్ చేసే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వ్యక్తం చేశారు.

# తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశం

**శంకరపట్నం, మార్చి 26(మనం న్యూస్)** : తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పి ఐ సి చైర్మన్ కేతిరి మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశంను బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కారదర్శి పోలు వీరాస్వామి నివేదిక చదివి వినిపించారు హుజురాబాద్ అసిస్టెంట్ రిజిష్టార్ అశోక్ కుమార్, సహకార సంఘాల పనితీరు ఫలితాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పి ఐ సి మెంబర్లు రమణ రెడ్డి, సత్యనారాయణ రావు, సమ్మయ్య,ప్రవీణ్, శేషచారీ వేణు ప్రజలు పాల్గొన్నారు.

# మానవతా సదన్ చిన్నారులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

- ఆకాంక్షించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**నిజామాబాద్ రూరల్, మార్చి 26(మనంన్యూస్):** డిచ్‌పల్లిలోని మానవతా సదన్ చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకాంక్షించారు. డిచ్పల్లి టోల్ వే (అథాంగ్) ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సుమారు 45 లక్షల రూపాయలను వెచ్చిస్తూ మానవతా సదన్ లో నూతనంగా వివిధ సదుపాయాలను సమకూర్చడం జరిగింది. స్టడీ రూమ్, రెండు టాయిలెట్లు, ఫ్రిడ్జ్, భారీ స్క్రీన్ తో కూడిన టెలివిజన్, సదన్ ఆవరణలో ఆర్.సి.సి సిట్టింగ్ బెంచీలు, వంట పాత్రలు, ఇతర సామాగ్రిని సదన్ కు వితరణ చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం మానవతా సదన్ ను సందర్శించి, నూతన నిర్మాణాలు, వస్తువులకు లాంఛనంగా ప్రారంభోత్సవాలు చేశారు. సదన్ లోని కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, డార్మెటరీ, ప్లే గ్రౌండ్, లైబ్రరీ తదితర వాటిని కలెక్టర్ సందర్శించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. సదన్ కు చెందిన బాలికలు ఎంతో అందంగా కుండలపై, గాజు సీసాలపై రూపొందించిన కళాకృతులను, ఆకట్టుకునే రీతిలో చిత్రించిన పెయింటింగ్ లను పరిశీలించి అభినందించారు. సదన్ నిర్వహణ తీరుతెన్నుల గురించి ఎంతో ఆసక్తితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అనాథ బాలలను అన్నివిధాలుగా ఆదుకునేందుకు వీలుగా ఇదివరకు జిల్లాలో కలెక్టర్ గా కొనసాగిన ప్రస్తుత రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా తన హయాంలో 2016లో నెలకొల్పిన మానవతా సదన్ రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంటోందని అన్నారు. సదన్ లోని బాలలను సిబ్బంది తమ సొంత బిడ్డలుగా చూసుకుంటూ వారి అభ్యున్నతికి పాటుపడుతుండడం వల్ల అనేకమంది ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుతున్నారని అన్నారు. అందుబాటులో ఉన్న వనరులను, జిల్లా యంత్రాంగం తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఐ.ఏ.ఎస్, ఐ.పీ.ఎస్ లుగా కూడా రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, అంకిత భావం, ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. తాము అనాథలం, తమకు తల్లితండ్రులు లేరు అనే భావన పిల్లల దరి చేరకుండా వారికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు సమకూర్చేందుకు జిల్లా యంత్రాంగం చొరవ చూపుతోందని, ఈ దిశగా డిచ్‌పల్లిలో టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కూడా ముందుకు వచ్చి తోడ్పాటును అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరినప్పుడే మానవతా సదన్ ఆశయాలు, లక్ష్యాలు పూర్తి స్థాయిలో నెరవేరినట్లు అవుతాయని అన్నారు. అన్ని రంగాల్లో సత్తా చాటుతూ, ఇతరులకు ఆదర్శంగా నిలువాలని సూచించారు. సదన్ నిర్వహణకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, వాటిని పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సదన్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మానవతా సదన్ లైజనింగ్ ఇంచార్జ్ సుధాకర్, కేర్ టేకర్ రమేష్, టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్, రిషా, రోడ్ సేఫ్టీ విభాగం అధికారి హర్ష, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- డిపిఎం సాయిలు

**భీంగల్, మార్చి 26(మనంన్యూస్):** మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నిజామాబాద్ డిపిఎం సాయిలు... బుధవారం భీంగల్ మండల సమైక్య కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధికతపై గ్రామ సంఘం అధ్యక్షులు వివోఏ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. డిపిఎం సాయిలు మాట్లాడుతూ:ఏ పని చేతకాని వారు సులభంగా డబ్బు సంపాదించారన్న దురాచారాల వల్ల మానవ అక్రమ రవాణాకు ప్రయత్నిస్తున్న అన్నారు . దీనిపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ,. వారు రోజువారి దినచర్యకు ఎప్పటికప్పుడు గమనించాలని మహిళలకు సూచించారు. మానవ అక్రమ రవాణా ద్వారా లైంగిక దోపిడీ అవయవ దోపిడీ ల పట్ల మహిళలకు చైతన్యం చేయాలని కోరారు. గ్రామ సంఘం అధ్యక్షులు గ్రామాలలో ప్రతి సంఘం సమావేశంలో ఈ అంశాన్ని మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ ఆధారిత అక్రమ రవాణా లైంగిక వేధింపులు రవాణా చట్టాలపై అవగాహన ,. సైబర్ నేరాలు పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ అధికారులు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, గంగ సాయిలు, రఘు, భాస్కర్ , గంగాధర్ , సుమలత, గంగా లలిత, గణేష్ , ముత్యం, అరుణ,మహిళా సంఘాల అధ్యక్షురాలు మరియు వివోఏలు పాల్గొన్నారు...

# ఆస్తి పన్ను బకాయిల చెల్లింపుల కోసం వన్ టైం సెటిల్మెంట్

- ఒకే విడతలో చెల్లిస్తే 90 శాతం బకాయి వడ్డీ మాఫీ వర్తింపు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి

**నిజామాబాద్, మార్చి 26(మనం ప్రతినిధి):** ఆస్తి పన్ను బకాయిల చెల్లింపులపై రాయితీ సదుపాయాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం వన్ టైం సెటిల్మెంట్ ను అమలు చేస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఆస్తి పన్ను బకాయి ఉన్న వారు నిర్ణీత గడువు లోపు ఒకే విడతలో బకాయిలు చెల్లిస్తే, 90 శాతం వడ్డీ మాఫీ వర్తిస్తుందని అన్నారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రమే వన్ టైం సెటిల్మెంట్ ను ప్రభుత్వం అమలు చేయగా, ప్రజల నుండి వచ్చిన అభ్యర్థన మేరకు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తరాలు జారీ చేసిందని అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు పెండింగ్ లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలను ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు ఏక కాలంలో, ఒకే విడత కింద చెల్లిస్తే 90శాతం వడ్డీ మాఫీ వర్తిస్తుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆస్తి పన్ను బకాయి పడిన వారు ఈ నెల 31వ తేదీ లోపు చెల్లించి వడ్డీ రాయితీ వడ్డీ రాయితీ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ది పొందాలని హితవు పలికారు. గడువులోపు వన్ టైం సెటిల్మెంట్ కింద ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన వారికే ఈ అవకాశం వర్తిస్తుందని అన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ ప్రజలను కోరారు. కాగా, వన్ టైం సెటిల్మెంట్ పథకం అమలులోకి రాకముందే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మార్చి 2025 వరకు వడ్డీ, జరిమానాలతో కలిపి మొత్తం ఆస్తి పన్ను బకాయిలను చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు, వారి భవిష్యత్తు చెల్లింపులలో రాయితీని సర్దుబాటు చేస్తారని కలెక్టర్ తెలిపారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**నిజామాబాద్, మార్చి 26(మనంప్రతినిధి):** ప్రభుత్వాన్ని నిలదీస్తాం హక్కులను సాధిస్తామని,హామీల అమలు కోసం వినూత్న తరహాలో ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈరోజు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం ఇచ్చే హామీని అమలు చేయాలని, వినూత్నంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తూ తక్షణమే తులం బంగారం ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బంగారు కడ్డీలను పోలిన వాటిని ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు పెళ్లయిన వారికి కూడా తులం బంగారం ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీల డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేస్తుందని తులం బంగారం కోసం ఎదురుచూస్తున్న ఆడపిల్లల తల్లిదండ్రులు ఏమి సమాధానం ఇస్తారని ఆమె మండిపడ్డారు. అధికారంలోకి రావడానికి తప్పుడు మాయమాటలు చెప్పి ప్రజలకు మోసం చేసిన ప్రభుత్వం కొనసాగడం సిగ్గుచేటని ఆమె అన్నారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు అమలు చేస్తలేరని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న అమాయక ప్రజల జీవితాలతో చెలగాట ఆడడం ఎంతవరకు సమంజసం అని ఆమె అన్నారు. ఏదేమైనా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తో పాటు పలువురు ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు.

# అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్న 9 టిప్పర్లు స్వాధీనం

**బోధన్, మార్చి 26(మనంన్యూస్):** బోధన్ నియోజకవర్గంలోని మందర్న సమీపంలో అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 9 టిప్పర్లను పక్క సమాచారంతో జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకోవడం జరిగిందని టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ అడిషనల్ డిసిపి శ్రీనివాసరావు అన్నారు. అదేవిధంగా 9 టిప్పర్లతో పాటు మూడు జెసిబిలు, 12 మంది డ్రైవర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ఫోర్స్ ఇన్స్పెక్టర్ అంజయ్య ఎస్సిఐ స్పెషల్ పార్టీ సిబ్బంది గోవింద్ తో పాటు పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను డ్రైవర్లను బోధన్ ఎస్ హెచ్ ఓ కు అప్పగించడం జరిగిందని ఆయన అన్నారు. వారిపై శాఖ పరమైన చర్యలు ఉంటాయని స్పష్టంగా తెలియజేశారు.

## జాతీయం- అంతర్జాతీయం

# తప్పుదోవ పట్టించే ప్రకటనలు..

- 'ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని' ఏర్పాటు చేయాలని ఆదేశించిన సుప్రీం
- పతంజలి ఆయుర్వేద సంస్థ కేసులో అత్యున్నత న్యాయస్థానం స్పందన

**ఢిల్లీ, మార్చి 26 :** తప్పుదారి పట్టించే ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) సమాజానికి తీవ్ర హాని చేస్తాయని భారత సర్వోన్నత న్యాయస్థానం

పేర్కొంది. ఈ విషయానికి సంబంధించి 'ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని' ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. రెండు నెలల్లోగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్టు-1954 కింద నిషేధించిన ప్రకటనలకు సంబంధించి అభ్యంతరాలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్రాలు రూపొందించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్లతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. వీటిని రెండు నెలల్లో ఏర్పాటు చేయాలని, దీని గురించి ప్రచారం కూడా కల్పించాలని స్పష్టం చేసింది. 1954 చట్టంలోని నిబంధనల అమలుపై పోలీసులకు అవగాహన కల్పించాలని ఆదేశించింది.

తప్పుదోవ పట్టించే ప్రకటనల కట్టడికి సంబంధించి గతంలో పలు సూచనలు చేసిన న్యాయస్థానం.. ప్రకటనలు జారీ చేసే ముందు కేబుల్ టెలివిజన్ నెట్ వర్క్ రూల్ 1994 ప్రకారం స్వీయ ధ్రువీకరణ తీసుకోవాలని ఆదేశించింది. ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. అసత్య, తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని పేర్కొంటూ ఆ సంస్థను మందలించింది. అనంతరం పతంజలి ఆయుర్వేద సంస్థ కూడా సుప్రీం కోర్టుకు క్షమాపణలు తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఇటువంటి ప్రకటనల కట్టడి చర్యల్లో భాగంగా సుప్రీం తాజా ఆదేశాలు జారీ చేసింది.

# బెట్టింగ్ యాప్ వ్యవహారం.. మాజీ సీఎం ఇంట్లో సీబీఐ సోదాలు

**రాయ్‌పూర్, మార్చి26 :** ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్‌పై కేసుల ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే మద్యం కుంభకోణానికి సంబంధించి ఆయన నివాసంలో ఈడీ సోదాలు జరపగా.. తాజాగా బెట్టింగ్ యాప్ వ్యవహారంలో సీబీఐ దాడులు నిర్వహిస్తోంది. రాయ్‌పూర్ , భిలాయిలోని ఆయన నివాసాల్లో సీబీఐ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. బఘేల్‌కు అత్యంత సన్నిహితుడైన ఓ సీనియర్ పోలీసు అధికారి ఇంట్లోనూ ఈ దాడులు జరుగుతున్నాయి.

తాజా సోదాలపై అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అయితే, మహదేవ్ బెట్టింగ్ యాప్ వ్యవహారానికి సంబంధించిన కేసులో ఈ తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.6000 కోట్ల విలువైన ఈ మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం వ్యవహారంలో ఇప్పటికే బఘేల్‌పై రాష్ట్ర ఆర్థికనేరాల విభాగం కేసు నమోదు చేసింది. 2023లో జరిగిన ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహదేవ్ ఈ స్కామ్

వెలుగులోకి వచ్చింది. బెట్టింగ్ యాప్‌ను రూపొందించేందుకు అప్పట్లో సీఎంగా ఉన్న భూపేశ్ తనను ప్రోత్సహించారని, ఆయనకు రూ.508 కోట్లు చెల్లించానంటూ యాప్ యజమాని శుభమ్ సోనీ సంచలన ఆరోపణలు చేశాడు. ఈ ఆరోపణలను బఘేల్ ఖండించారు.

అనంతరం దీనిపై దర్యాప్తు చేపట్టిన ఈడీ.. ఈ కుంభకోణంలో పలువురు కీలక రాజకీయ నేతలు, అధికారుల పాత్ర ఉన్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో తాజాగా బఘేల్ నివాసంలో సీబీఐ దాడులు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సోదాలపై మాజీ సీఎం స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం కోసం తాను ఢిల్లీ వెళ్లబోతున్న సమయంలో సీబీఐ తమ నివాసానికి వచ్చినట్లు తెలిపారు. బీజేపీ కుట్రలో భాగంగానే తనపై ఈ దాడులు చేస్తున్నట్లు దుయ్యబట్టారు. ఇటీవల మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి బఘేల్, ఆయన కుమారుడు చైతన్య నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఆ సోదాల సందర్భంగా రూ.30 లక్షల నగదు, పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఆ తనిఖీల అనంతరం తిరిగివెళ్తున్న ఈడీ అధికారుల వాహనాలపై నిరసనకారులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.

# ఐదేళ్ల విరామం తర్వాత చైనా నుంచి నేరుగా విమాన సర్వీసులు!

**కోల్‌కతా, మార్చి 26:** కొవిడ్, గల్వాన్ సంఘర్షణ నేపథ్యంలో భారత్, చైనా మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసులు పునరుద్ధరించడానికి చర్చలు జరుపుతున్నట్లు చైనీస్ కాన్సుల్ జనరల్ జు వీ పేర్కొన్నారు. అయితే ఐదేళ్ల తర్వాత నేరుగా విమాన

సర్వీసులను తిరిగి ప్రారంభించాలని యోచిస్తున్నట్లు చైనా కాన్సుల్ జనరల్ జు వీ పేర్కొన్నారు. ఈ మేరకు భారత అధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు. కోల్‌కతాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ''కొవిడ్‌కు ముందు బీజింగ్, షాంఘై, గ్వాంగ్జౌ, కున్మింగ్ నుంచి భారత్‌లోని ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, ఇతర నగరాలకు వారానికి 50 విమాన సర్వీసులుండేవి. ఆ సేవలను తిరిగి పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నాం'' అని ఆయన తెలిపారు. విమానాల పునరుద్ధరణ తర్వాత వీసా నిబంధనల్లో కూడా సడలింపులు చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలకు మరో వారంలో 75 ఏళ్లు పూర్తవుతుండడంతో..ఈ సందర్భంగా ఏప్రిల్ 1న ఇరుదేశాలు సంయుక్తంగా కొన్ని వేడుకలను జరుపుకోనున్నట్లు జు వీ వెల్లడించారు. భారత్‌తో కలిసి ఈ వేడుకలను జరుపుకోవడానికి, దౌత్య సంబంధాలను మరింత మెరుగుపరుచుకోవడానికి తాము ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామని అన్నారు.

జనవరిలో భారత్ విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ చైనాను సందర్శించిన తర్వాత భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ మొదట ఈ ప్రకటన విడుదల చేసింది. ఇరుదేశాల మధ్య విమాన సేవలను తిరిగి ప్రారంభించడానికి సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు తెలిపింది. కొవిడ్ 19 మొదలైనప్పటి నుంచి ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల లద్దాఖ్ సరిహద్దులో బలగాల ఉపసంహరణ, గస్తీ పునఃప్రారంభం విషయంలో రెండు దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో నేరుగా విమాన సర్వీసుల అంశం చర్చకు వచ్చినట్లు పేర్కొంది.

# దక్షిణ కొరియాలో కార్చిచ్చు.. 24 మంది మృతి

**సియోల్, మార్చి 26:** దక్షిణ కొరియాలో కార్చిచ్చును ఆపేందుకు వెళ్లిన హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ఒక పైలెట్ మృతి చెందారు. దక్షిణ కొరియాలో దట్టమైన కార్చిచ్చు వ్యాపిస్తోంది. ఈ మంటలను ఆర్పేందుకు స్థానిక అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మంటల కారణంగా ఇప్పటివరకు దాదాపు 24 మంది మృతి చెందారు. అంతేకాక.. శతాబ్దాల నాటి బౌద్ధ దేవాలయం కూడా ధ్వంసమైంది. ఇంటీరియర్ సేఫ్టీ మినిస్ట్రీ ప్రస్తుత పరిస్థితిపై ఓ రిపోర్ట్‌ను విడుదల చేసింది. దాని ప్రకారం.. పొడి గాలుల కారణంగా మంటలు వేగంగా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. దీని కారణంగా వాటిని అదుపు చేయడంలో అధికారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దాదాపు 24 మంది మృతిచెందగా.. మరో 26 మంది గాయపడ్డారు. ఇక,

మంటలను ఆర్పేందుకు వెళ్లిన హెలికాప్టర్ కూలిపోగా.. అందులోని పైలెట్ మృతి చెందారు. ఉయిసాంగ్ కౌంటీలో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. దీంతో 1,300 సంవత్సరాల నాటి పురాతన గౌన్సా దేవాలయం కాలిపోయింది.

అయితే, ఆలయంలోని కళాఖండాలతో సహా పలు విగ్రహాలను ముందే ఇతర దేవాలయాలకు తరలించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ కార్చిచ్చును ఆర్పేందుకు 10 వేల మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది, పౌర సేవకులు శ్రమిస్తున్నారు. కార్చిచ్చు వల్ల బుధవారం నాటికి 43 వేల ఎకరాలు కాలి బూడిదయ్యాయని అధికారులు వెల్లడించారు. స్థానిక నివాసితులను ఖాళీ చేయమని ఇప్పటికే ఆదేశించినట్లు వెల్లడించారు. 68 శాతం మంటలు అదుపులోకి వచ్చాయన్నారు. ఉత్తర, దక్షిణ జియోంగ్సాంగ్, ఉల్సాన్ నగరంలోని అనేక ప్రాంతాల్లో మాత్రం మంటలు చురుకుగా వ్యాపిస్తున్నాయి. ఈ కార్చిచ్చుపై దక్షిణ కొరియా ప్రధానమంత్రి, తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్- సూ స్పందించారు. 'ఇది అత్యంత ఘోరమైనది. ఈ మంటల కారణంగా అంతులేని నష్టం ఏర్పడింది. దీనికి మేము ఎంతో ఆందోళన చెందుతున్నాం. మంటలను అదుపు చేయడంపై ప్రత్యేక దృష్టిసారించాం. ఇవి పొరుగు ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని కోరుతున్నా' అని ఆయన పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే బసనగౌడకు బీజేపీ షాక్.. ఆరేళ్లు బహిష్కరణ వేటు

**బెంగళూరు, మార్చి 26:** కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ పై ఆ పార్టీ బహిష్కరణ వేటు వేసింది. ఆరేళ్ల పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించినట్లు తెలిపింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంటూ బీజేపీ కేంద్ర క్రమశిక్షణ కమిటీ ఆయనకు లేఖ రాసింది. పార్టీతో పాటు మాజీ సీఎం బీఎస్ యడియూరప్పకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో ఫిబ్రవరి 10న షోకాజ్ నోటీసులు జారీ చేసిన బీజేపీ.. తాజాగా ఆయనపై కఠిన చర్యలు తీసుకుంది.

బసనగౌడ రియాక్షన్ ఇదే..

పార్టీ నుంచి తనను బహిష్కరించడంపై ఎమ్మెల్యే బసనగౌడ స్పందించారు. వారసత్వ రాజకీయాలు, అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు, పార్టీలో సంస్కరణలు, వ్యక్తుల ఆధిపత్యాన్ని తొలగించాలని, ఉత్తర కర్ణాటకను అభివృద్ధి చేయాలని అడిగినందుకు తనను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించారని ఆరోపించారు. ముక్కుసూటిగా మాట్లాడినందుకు ఇది పార్టీ తనకు ఇచ్చిన రివార్డుగా పేర్కొన్నారు. అవినీతి, కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా, ఉత్తర కర్ణాటక అభివృద్ధి, హిందుత్వ కోసం తన పోరాటం కొనసాగుతుందన్నారు. ఇదే ఉత్సాహం, దృఢ సంకల్పంతో ప్రజాసేవ చేస్తానని, తనకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

# అసెంబ్లీకి రారు గానీ.. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్

- మాజీ సీఎం గహ్లోత్‌పై సీఎం విమర్శలు

**జైపుర్, మార్చి 26:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం అశోక్ గహ్లోత్‌పై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించడానికి బదులుగా 'ఎక్స్'లో పోస్టులపై ఫోకస్ పెట్టారని ఆరోపించారు. బికనీర్‌లో జరిగిన ఓ రైతు సదస్సులో సీఎం మాట్లాడారు. అశోక్ గహ్లోత్ అసెంబ్లీ సమావేశాలకు ఒక్కరోజు కూడా హాజరు కావడం లేదు గానీ.. 'ఎక్స్'లో మాత్రం క్రియాశీలంగా ఉంటున్నారన్నారు. ఆ పోస్టులతో హెడ్‌లైన్‌లలో నిలవాలని కోరుకొంటున్నారని ఆరోపించారు.

''ఎక్స్'లో ఏదైనా పోస్టు చేసే ముందు మీ ట్వీట్లు ఒకసారి చూసుకోండి. గత ఐదేళ్లలో మీరు అధికారంలో ఉన్న సమయంలో ప్రజల కోసం ఏం చేశారో చూడండి. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తే సరిపోదు. ప్రజల మధ్యకు వెళ్లి వారి బాధల్ని అర్థం చేసుకోవాలి. వాటిని పరిష్కరించడం ప్రభుత్వ విధి' అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఓ యువ నేత రైతుల వద్దకు వచ్చి రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చినా.. అది జరగలేదంటూ ఆ నేత పేరు ప్రస్తావించకుండా విమర్శలు చేశారు. బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేయడం గురించి సదరు నేత మాట్లాడారన్నారు. రాజస్థాన్ రైతులకు నీరు సరిగా అందితే.. కచ్చితంగా రైతులు భూమి నుంచి బంగారం పండిస్తారన్నారు.

సీఎం భజన్‌లాల్ శర్మ వ్యాఖ్యలకు మాజీ సీఎం అశోక్ గహ్లోత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కనీస మద్దతు ధరకు పంటలను సేకరించాలని గతంలో కాంగ్రెస్ సర్కార్‌కు భజన్లాల్ చేసిన డిమాండ్‌కు సంబంధించిన పాత ట్వీట్‌ను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఎస్‌పీపై చిరుధాన్యాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ దాదాపు రెండున్నరేళ్ల క్రితం చేసిన మీ ట్వీట్‌ను మీకు గుర్తు చేయాలనుకుంటున్నా. ఇప్పుడు మీ ప్రభుత్వం ఒకటిన్నరేళ్లు పూర్తి చేసుకోబోతోంది. మీ మ్యానిఫెస్టోలో ఎంఎస్‌పీ ధరపై చిరుధాన్యాలు కొంటామని హామీ ఇచ్చారు కదా.. మరి ఎప్పుడు కొనుగోలు ప్రారంభిస్తారో చెప్పండి'' అని అశోక్ గహ్లోత్ నిలదీశారు.

# గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడండి

- ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రజా పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఒక్క అర్జీని పరిష్కరిస్తాం

**గడివేముల, మార్చి 26(మనంన్యూస్)ః** గడివేముల మండల పరిషత్ కార్యాలయము నందు బుధవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మండలంలోని ప్రజల సమస్యలు పరిష్కారం కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి ఎక్కువగా గ్రామాలలో మంచినీటి సమస్య ఉందని వినతులను అందించాలని తెలిపారు. మండలంలో అన్ని గ్రామాలకు చెందిన అధికారులు గ్రామంలో నీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను తెలిపారు. గ్రామాలలో అధికారులు పర్యటించి ఎక్కువగా నీటి సమస్య ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా అందించాలని ఆదేశించారు. స్మశాన వాటికకు స్థలం లేని గ్రామాలలో స్థలాన్ని కేటాయించి ఉపాధి నిధుల కింద కాంపౌండ్ నిర్మిస్తామని తెలిపారు. చాలా గ్రామాలలో పాఠశాలలకు సగం బాగానే కాంపౌండ్ నిర్మించి వదిలేశారు. దీనివల్ల పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయని త్వరలో వాటిని కూడా కాంపౌండ్ నిర్మిస్తామన్నారు. ఏప్రిల్ నెలలో వచ్చే ఉపాధి నిధులతో పంట పొలాలకు వెళ్లడానికి రస్తా సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎక్కువగా వినతి పత్రాలు రెవెన్యూ సమస్యలపై వచ్చాయని రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టి రెవెన్యూ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మండలంలోని ఐదు పొదుపు లక్ష్మి గ్రూపులకు 38 లక్షల చెక్కును పొదుపు మహిళలకు అందించారు. మాజీ సర్పంచ్ జమాల్ బాషా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికు గడివేములలో ముస్లిం సోదరులు నూర్ భాషా సోదరులు ఎక్కువగా ఉన్నారు ఈద్గా లేక ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి రెండు కోట్ల నిధులతో మంజూరైన బైపాస్ రోడ్డు ను త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యేలు రైతులకు వచ్చే సీజన్ కల్లా అలగనూరు రిజర్వాయర్ కట్ట పనులను ప్రారంభించి పనులను త్వరగా పూర్తిచేశాలా చర్యలు చేపట్టాలని మాజీ సర్పంచ్ జమాల్ బాషా ఎమ్మెల్యే కు వినతి పత్రాన్ని అందించారు.

అనంతరం కార్యకర్తల సమావేశంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ అనసూయమ్మ, సర్పంచ్ మాలిక్ భాష, సర్పంచ్ గంగాధర్ రెడ్డి, సర్పంచ్ రవణమ్మ, టిడిపి నాయకులు వంగాల మురళీమోహన్ రెడ్డి, హర్షవర్ధన్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సుదర్శన్ రెడ్డి, జయప్రకాశ్ రెడ్డి, ఎస్ ఏ రఫీ, పంట రామచంద్రారెడ్డి, కంది శ్రీనివాసులు, రాచమను శ్రీనివాసులు, గిరిబాబు, సుకుమా చారి, రాజు నాయక్, గంజర్ల గణేష్ రెడ్డి, దేశం రమణారెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్ బాషా,బత్తుల సుభద్రమ్మ, వడ్డు లక్ష్మీదేవి, హైమావతమ్మ, తాసిల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో వాసుదేవ గుప్తా, అన్ని శాఖలకు చెందిన అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ గా ఆప్టా సేవలాల్ నాయక్

**కర్నూల్ మార్చి 26 (మనం న్యూస్)ః** ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ ఆదేశాల ప్రకారం 2025 -27 కు గాను కర్నూలు జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ ఎన్నిక కర్నూలు జిల్లా ఎస్ టీ యు భవన్ యందు బుధవారం సాయంత్రం 5 గంటలకు జరిగింది.ఈ కార్యక్రమం నకు రాష్ట్ర పరిశీలకుడు గా రాష్ట్ర ప్యాప్తో కో ఛైర్మన్ మరియు కర్నూలు జిల్లా ఫాప్తో ఇంచార్జి కాకి ప్రకాష్ రావు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమం యందు 13 సభ్య సంఘాల జిల్లా అధ్యక్షుడు మరియు ప్రధాన కార్యదర్శి హాజరు కావడం జరిగింది. ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్( ఆప్టా) జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్ ను ఫెప్టో కర్నూలు జిల్లా ఛైర్మన్ గా , సెక్రెటరీ జనరల్ గా జి భాస్కర్ (బి టి ఎ),కో ఛైర్మన్ లు గా వై నారాయణ ,వి జి వెంకట రాముడు (డి టి ఎఫ్), ఎస్ గులాబ్ భాష (రూట), రాజేష్ (ఎస్ సి/ఎస్ టి యూనియన్) డిప్యూటీ సెక్రటరీ జనరల్ గా యు రవికుమార్ (యు టి ఎఫ్), టి కె జనార్ధన్ (ఎస్ టి యు), ఎస్ ఇస్మాయిల్ (ఎ పి టి ఎఫ్ 1938), కోశాధికారి గా ఎన్ రంగన్న (ఎ పి టి ఎఫ్ 257) నుండి ఎన్నిక కావటం జరిగింది. ఈ ఎన్నిక కార్యక్రమము లో నవీన్ పాటిల్ (యు టి ఎఫ్), ఎస్ గోకారి (ఎస్ టి యు),మరియనందం(ఎ పి టి ఎఫ్ 1938), తిమ్మప్ప (డి టి ఎఫ్) మధుసుధన్ రెడ్డి (ఆప్టా) మొదలైన జిల్లా నాయకులు పాల్గొనటం జరిగింది.

# నేడు ఎంపీపీ ఉప ఎన్నిక

**వెల్దుర్తి:మార్చి(మనంన్యూస్)ః** మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలి (ఎంపీపీ ) ఉపఎన్నిక నేడు నిర్వహించనున్నట్లు ఎలక్షన్ ఆఫీసర్ తులసీదేవి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి గురువారం ఉదయం 10 గంటలకు చేరుకోవాలన్నారు. 11 గంటలకు ఎంపీపీ ఉపఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఎన్నికకు సంబంధించి ఇప్పటికే 17 మంది ఎంపీటీసీ సభ్యులకు సమాచారం అందించామని పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మండల అధ్యక్షురాలిగా దేశాయి లక్ష్మీదేవికి పార్టీ కార్యాలయం నుండి బీ-ఫామ్ అందించడంతో వైకాపా నాయకులు దేశాయ్ షమీర్ కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్ రెడ్డి, ఎం. శ్రీరామ్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షులు గట్టు ఆరిఫ్ లతో కలసి వెల్దుర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకొని ఎలక్షన్ ఆఫీసర్ తులసిదేవికి నామినేషన్ పత్రాన్ని అందజేశారు.

## తమ్ముడిపై అన్న గొడ్డలితో దాడి

**మహానంది, మార్చి26,మనంన్యూస్ః** రాస్తా విషయంలో తమ్ముడిపై అన్న గొడ్డలితో దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహానంది మండలం, తమడపల్లి గ్రామానికి చెందిన బాల నారాయణ తమ్ముడు బాల నాగన్నలకు రాస్తా విషయంలో ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. పెద్దమనుషుల సమక్షంలో రస్తా కు బాల నాగన్న 1లక్ష 65 వేలు చెల్లించినట్లు తెలిపారు.అయితే ఇంకా 90వేలు ఇవ్వాలని రస్తాలో ఇబ్బంది పెడుతున్నట్లు తెలిసింది. మాటకు మాట పెరిగి పక్కనే వున్న గొడ్డలితో తమ్ముడిపై దాడికి పాల్పడినట్లు సమాచారం. అడ్డువచ్చిన అనితకు ముగాదెబ్బలు తగిలినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిసింది.మహానంది పోలీసులకు పిర్యాదు చేసినట్లు తెలిసింది.

# ర... కుం...స...కుం...అంతా ఒకటే

- ప్రజలు, కార్యకర్తలు ముందే ఏప్రిల్ ఫూల్ అంటున్ననేతలు
- పేరుకే శత్రువులు, మాటికి మిత్రులే
- చీదరించుకుంటున్నప్రజలు, కార్యకర్తలు
- ఇదేనా విశ్వతనియత రాజకీయం అంటున్నప్రజలు
- వీరి విధానాల్లో బలైనవారెందరో?
- గోడ పంచాయతీ కథ కంచికేనా?

**వెల్దుర్తి:మార్చి (మనంన్యూస్)ః** ఒకరు గ్యాంబ్లింగ్ స్టార్... మరొకరు లిక్కర్ డాన్... ఇన్నేళ్లుగా శత్రువుల మాటున వారు పంచుకున్న సామ్రాజ్యం ఇది. వీరి మధ్య విభేదాలతో ఎందరో సామాన్యులు కేసులు భరించి జెళ్ళ పాళ్లు అయ్యారు. చివరకు మేమంతా ఒకటే అంటూ ప్రజలకు కార్యకర్తలకు మరో ఐదు రోజుల్లో వచ్చే ఏప్రిల్ ఫూల్ ముందే చేశారు. ఇది నేటి వైఎస్ఆర్సిపి మండల రాజకీయ పరిస్థితి. వర్గ విభేదాల నడుమ సొంత పార్టీలోని నరకం చూసి ఆస్తులు పోగొట్టుకొని కేసులు బారినపడిన ఓ సామాన్య కార్యకర్త దుస్థితిపై మనం ప్రత్యేక కథనం. వారు ఇరువురు ఒకప్పుడు పేగు పంచుకోకున్న మంచి మిత్రులే. నిత్యం వారు ఇరువురు కలవందే రోజు కూడా గడవని బంధం వారిది. అలాంటివారు రాజకీయ లబ్ధి కోసం శత్రువులుగా అవతారం మెత్తారు. అందరిని నమ్మించె విధంగాఒకరిని మించి ఒకరు పోటాపోటీగా ప్రకటనలు ఇచ్చేశారు. అయితే అందరికీ తెలియని విషయం ఏమిటంటే పేరుకే శత్రువులు,మాటికి మిత్రులని ఇప్పటికీ అర్థమైందంటూ అందరూ చెవులు కోరుకొంటున్నారు. నేడు ఎంపీపీ పదవి కోసం వీరి కలయిక చూసిన కొందరు ప్రజలు కార్యకర్తలు తూ... ఛీ... అని చీదరించుకుంటున్నారు. మొన్నటిదాకా శత్రువులమంటూ ఎందరినో ఒకరి పైకి ఒకరిని ఉసిగొలుపీ సొంత కార్యకర్తలపైనే కేసులు పెట్టించిన వీరు ఇప్పుడు మేమంతా ఒక్కటే అనడం నీచ రాజకీయాలకు నిదర్శనమని సొంత పార్టీ కార్యకర్తలే అనుకుంటున్నారు. వైయస్సార్సీపి పార్టీ అంటేనే విశ్వసనీయకు మారుపేరు అని చెప్పుకుంటున్న నేతలు మొన్నటిదాకా ఒకరిపై ఒకరు గోతులు తవ్వుకొని ఇప్పుడు ఒకటి కావడమేనా విశ్వసనీయత అంటూ అందరూ ప్రశ్నిస్తున్నారు. వారి స్వార్థ రాజకీయాల కోసం సొంత వారి బంధువులపై కూడా కేసులు పెట్టిన, ఆడవాళ్ళని చూడకుండగా కోర్టుల చుట్టూ తిప్పుతున్న స్పందించని వీరు, ఇప్పుడు పగవారి కోసం దిగజారిపోవడంపై దారుణంగా భావిస్తున్నారు. ఇలాంటి రాజకీయ దురుభివృద్ధితో ఎందరో బలయ్యారని ఇకముందు వీరి నాటకాలు నమ్మబోమని చర్చించుకుంటున్నారు. వెల్దుర్తి పట్టణంలోనే నడిబొడ్డున గ్యాంబ్లింగ్ కు కేంద్రంగా తయారు చేసుకుని పోలీసులకు పట్టుబడిన ఓ నేత స్థలం ఎన్నో కుటుంబాలకు అది రస్తా అని పోరాడిన మరో నేత మధ్య జరిగిన ఆదిపత్య పోరు కథ కంచికేనా అని అందరూ అనుకుంటున్నారు. ఒకరిపై ఒకరు పోరాడి గెలుస్తామని ఆడిన నాటకంలో ఎందరో అమాయకులు కేసులు బారినపడి ఇప్పటికే నరకం భరిస్తున్నారు. వందల కుటుంబాలకు ముడిపడిన ఆ రస్తా విషయం వీరి కలయిక తర్వాత కంచికే చేరుతుందని అందరూ అనుకుంటున్నారు. ఇకనైనా ఇలాంటి రాజకీయ మోసకారుల మైకంలో పడకుండగా ఉండాలని ప్రజలందరూ చర్చించుకుంటున్నారు.

# ఉపాధి హామీ పనులకు సరైన సమయంలో చేరుకోవాలి



- ఉపాధి హామీ ఎపిఓ రామన్న

**సి బెలగల్, మార్చి 26(మనం న్యూస్)ః** ఉపాధి సిబ్బంది అందరికీ బుధవారంనాడు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో ఏపీవో రామన్న మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి లేబర్ అచీవ్మెంట్ 430671 పరిధిలో పూర్తి చేశాము,21 మినీ గోకులాలు పూర్తి చేశాము, 78 మంది రైతులకు పండ్ల తోటలు నాటించాము, మండలం యావరేజ్ వేజ్ రేట్ 290/- కూలి కల్పించాము, 10963 జాబ్ కార్డులకు,18505 మంది కూలీలకు పని కల్పించాము, ఎండలు పెరిగాయి కాబట్టి, ప్రతి గ్రామంలో ఉదయం 7 గంటలకే పనులకు పోవాలి, చక్కగా పనిచేయాలి, పని దగ్గర ఎవరికైనా, నీరసం వస్తే ఖ్ఖి ప్యాకెట్స్ నీళ్లలో కలిపి తాపడానికి, అన్ని గ్రామాలకు, ఎంపిడిఒ మేడం గారి చేతుల మీదుగా ఏప్రిల్ నెలకు సంబంధించి 750 ొటటప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది.

# మహానంది లో కన్నడిగుల కోలాహలం

**మహానంది, మార్చి26,మనంన్యూస్:** మహానంది పుణ్యక్షేత్రంలో కన్న డిగుల కోలాహలం నెలకొనింది. గత నాలుగురోజుల నుండి కన్నడ భక్తులతో క్షేత్రం రద్దీగా ఉంది. బుధవారం తెల్లవారుజామున వందల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. భక్తుల రాకను గమనించిన దేవస్థానం ఈఓ శ్రీనివాసరెడ్డి,ఏ ఈఓ మధు లు సిబ్బంది తో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున మూడు గంటలకు ఆలయ తలుపులు తెరిచి నాలుగుగంటల తరువాత భక్తులకు దర్శనం సౌకర్యాన్ని కల్పించారు. ఎండ తీవ్రత ఎక్కువగా వున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.దేవస్థానం అధికారులు ఏర్పాటు చేసిన ఉచిత దర్శనం,20,50,150 రూపాయల క్యూ లైన్లలో భక్తులు శ్రీకామేశ్వరీ దేవీ సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు కావలసిన పులిహోర, లడ్డు ప్రసాదాలను అందుబాటులో ఉంచారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు మల్లయ్య, సుబ్బారెడ్డి, ఆర్ ఎస్ శ్రీనివాసులు, ఏ ఈ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# 2 నుండి క్రికెట్ పోటీలు ప్రారంభం

**మహానంది, మార్చి26,మనంన్యూస్:** వచ్చే నెల 2 నుండి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు,మహానంది మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మౌళీశ్వర రెడ్డి బుధవారం తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే జట్టు లు ఈనెల 29నాటికి వెయ్యి రూపాయల ఎంట్రీ ఫీజు చెల్లించాలని కోరారు.నంద్యాల జిల్లా, మహానంది మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పోటీలకు హాజరయ్యే వారునిర్వాహకుల వద్దనే బాల్ కొనుగోలు చేయాలన్నారు. అరగంట ముందే రావాలన్నారు.క్రీడాకారులు ఆధార్ కార్డులు వెంట తెచ్చుకోవాలన్నారు. నంద్యాల జిల్లా వాసులై ఉండాలన్నారు. మొదటి బహుమతి 50వేలు, రెండవ బహుమతి 30వేలు, మూడవ బహుమతి 20వేలు,నాలుగవ బహుమతి 10వేలు అందించేసునున్నట్లు షణ్ముఖ రెడ్డి, హేమనాద్ రెడ్డి,కుపేంద్రా రెడ్డి,సూర్యప్రకాష్ రెడ్డి లు తెలిపారు. అంపైర్ దే తుది నిర్ణయం అని తెలిపరు.మద్యం సేవించి వస్తే క్రీడలో పాల్గొనిచ్చేది లేదని అన్నారు. ఎంట్రీ ఫీజు ప్రారంభం అయ్యాయన్నారు.

# గిరిజన యువతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

**కర్నూలు, మార్చి 26(మనం న్యూస్)ః**జిల్లాలో గిరిజన యువతకు ప్రత్యేకంగా నిరుద్యోగులకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని బుధవారం సెట్కూరు జిల్లా యువజన సంక్షేమ అధికారి వేణుగోపాల్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి కోరడమైనది.ఈ సందర్భంగా టి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ జిల్లా లో ఎంతో మంది గిరిజన నిరుద్యోగ యువత ఉపాధి లేక నిరుద్యోగులుగా ఉన్నారన్నారు అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం వారికి ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించి గిరిజన నిరుద్యోగ యువతను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో టి ఎస్ ఎఫ్ నాయకులు అంజి నాయక్,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయండి

**కర్నూలు, మార్చి 26(మనం న్యూస్)ః** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు లో4-4-2025 ననిర్వహించు జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయండి కర్నూల్ సిపిఐ కార్యాలయం సి ఆర్ భవన్ నందు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య అధ్యక్షతన రైతు సంఘం జిల్లా సమితి సమావేశం నిర్వహించబడినది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి రామచంద్రయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం పాల్గొన్నారు ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి రామచంద్రయ్య గ మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో వ్యవసాయం సంక్షోభంలో పడిందని వ్యవసాయం గిట్టుబాటు గాక రైతులు అప్పులు చేసుకొని అప్పులు కట్టుకొని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు అధికారంలో ఉన్న కేంద్రంలో ఉన్న బిజెపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం జనసేన కుటుంబ ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు వ్యవసాయాన్ని లాభసాటిగా ఉండాలంటే డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేసి రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లకు చట్టం చేసే విధంగా రైతుల పంట రుణాలు పూర్తిగా మాఫీ చేసే విధంగా వీటిని సక్రమంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరిచి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని వారు తెలిపారు ఇప్పుడు దేశంలో ఉన్న పరిస్థితులు దారుణంగా ఉన్నాయి మరి వాతావరణంలో రైతులను సమైక్యపరచి చైతన్యవంతం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జాతీయ మహాసభలు ఏప్రిల్ 15 16 17 తేదీలలో నిర్వహిస్తున్నందున కర్నూల్ లో జరుగు జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య గారు మాట్లాడుతూ బిజెపి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిందని జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయలేక వైఫల్యం చెందిందని విమర్శించారు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం గారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జిల్లాలో రైతు ఉద్యమాలు పెరిగాయని కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తక్షణమే రైతుల ఖాతాలో అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన గౌడ్ గత రైతు సంఘకార్యక్రమాల సమీక్ష అదేవిధంగా 60 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు నెలకు 10,000 పెన్షన్ మరియు గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత పలు డిమాండ్ల మీద భవిష్యత్ కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం కార్యదర్శి తిమ్మయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి రాజా సాహెబ్ ,సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, కారన్న కాశి, పరమేశ్వర్ రెడ్డి, రంగన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చింతల మహేష్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వేదికలో ప్రజల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి

**బేతంచేర్ల, మార్చి 26(మనం న్యూస్)ః** పట్టణంలో ఆర్ఎం బి గెస్ట్ హౌస్ లో నిర్వహిస్తున్న ప్రజా వేదిక కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు ప్రజా వేదిక కార్యక్రమానికి పట్టణ మండల గ్రామ ప్రజలు పాల్గొన్నారు ప్రజా వేదిక కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ప్రజల అర్జీలను పరిశీలించి వారి సమస్యల కు సంబంధించిన అధికారులతో అర్జీదారుల ను మాట్లాడించి వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు ఎంపీడీవో ఫజులు రెహమాన్ తాసిల్దార్ ప్రకాష్ బాబు నగర కమిషనర్ హరిప్రసాద్ వివిధ శాఖల అధికారులు మండల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# వచ్చే మ్యాచ్‌లో శతకం చేస్తాను అయ్యర్

గుజరాత్ తో మ్యాచ్ సందర్భంగా అయ్యర్ శతకాన్ని త్రుటిలో కోల్పోయాడు. 97 పరుగుల వద్ద నాటౌట్ గా నిలిచాడు. దీనిపై అతడు మ్యాచ్ అనంతరం స్పందిస్తూ.. వచ్చే మ్యాచ్ లో శతకం సాధిస్తానని ఆత్మవిశ్వాసంగా చెప్పారు. ''గుజరాత్ టైటాన్స్ ఎదుట భారీ స్కోర్ ఉంచాలనే లక్ష్యంతో ఆడాము. ఎందుకంటే జీటీ బ్యాటింగ్ లైనప్ చాలా బలంగా ఉంది. ఐపీఎల్ లో చివరి వరకు ఏమైనా జరగొచ్చు. శశాంక్ సింగ్ ను నేనే భారీ షాట్స్ ఆడమని చెప్పాను. నా శతకం గురించి పట్టించుకోలేదు. దానిని వచ్చే మ్యాచ్ లో సాధిస్తాను'' అని అయ్యర్ వెల్లడించాడు.

ఇక శశాంక్ దూకుడును కూడా అయ్యర్ అభినందించాడు. ''గతేడాది నీ బ్యాటింగ్ శైలిని చూసి నేను స్ఫూర్తి పొందాను. నిజం చెప్పాలంటే.. అది నాకు గట్టి ఆత్మవిశ్వాసం ఇచ్చింది. నువ్వు మైదానంలోకి వచ్చిరాగానే.. మూడో బంతి నుంచే విరుచుకుపడిన తీరు.. నువ్వు సాధించిన 44 పరుగులు చాలా ప్రభావవంతమైనవి. భవిష్యత్తులో కూడా ఇదే ఆటతీరును కొనసాగిస్తావని ఆశిస్తున్నా'' అని శశాంక్తో అన్నాడు. 2023 డిసెంబర్ లో అయ్యర్ చివరి సారి అంతర్జాతీయ టీ20 ఆడాడు. ఆ మ్యాచ్ లో అర్ధశతకం బాదాడు. ఆ తర్వాత పొట్టి ప్రపంచకప్ నుంచి దూరమయ్యాడు. కోల్కతా నైట్రైడర్స్ కు నాయకత్వం వహించాడు. ఆ తర్వాత అది కూడా రిటైన్ చేసుకోలేదు. కానీ, పంజాబ్ జట్టు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర రూ.26.75 కోట్లు చెల్లించి అతడిని కొనుగోలు చేసింది.

## అయ్యర్ అన్ని ఫార్మాట్‌లలో మంచి ఆటగాడు: గంగూలీ



బీసీసీఐ ఆగ్రహానికి గురై జట్టుకు కొన్నాళ్లు దూరమైన శ్రేయస్ అయ్యర్ ఆటతీరు గతేడాది అద్భుతంగా మెరుగుపడిందని గంగూలీ పొగడ్తల్లో ముంచెత్తాడు. నిన్న గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో అయ్యర్ అద్భుతంగా ఆడి 97 పరుగులు సాధించి.. పంజాబ్ జట్టును విజయ పథంలో నడిపించాడు. ఈ నేపథ్యంలో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఎక్స్ వేదికగా స్పందించాడు. ''గత ఏడాది కాలంలో అద్భుతంగా ఆటను మెరుగుపర్చుకొన్న ఆటగాడు శ్రేయస్ అయ్యర్. అతడు అన్ని ఫార్మాట్లకు సిద్ధంగా ఉన్నాడు. కొన్ని ఇష్యూల తర్వాత అతడు ఆటను మెరుగుపర్చుకొన్న తీరు చాలా గొప్పగా ఉంది'' అని పేర్కొన్నాడు.

## చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్న మ్యాక్స్వీ

ఆస్ట్రేలియా ఆటగాడు గ్లెన్ మ్యాక్స్ వెల్ ఐపీఎల్ లో పేలవ ఫామ్ కొనసాగుతూనే ఉంది. గతేడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున బరిలోకి దిగి పెద్దగా పరుగులు చేయలేదు. ఈసారి పంజాబ్ ఫ్రాంచైజీకి మారినా ప్రదర్శనలో మాత్రం తీసికట్టుగానే

ఉంది. గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి బంతికే గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. దీంతో ఐపీఎల్‌లో ఎక్కువసార్లు (19) డకౌట్‌గా పెవిలియన్‌కు చేరిన ఆటగాడిగా చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. గుజరాత్ బౌలర్ సాయికిశోర్ వేసిన బంతిని రివర్స్ స్వీప్ కొట్టేందుకు మ్యాక్స్ వెల్ ప్రయత్నించాడు. బంతి బ్యాట్ కు కనెక్ట్ కాలేదు. నడుము వద్ద తాకడంతో గుజరాత్ ఆటగాళ్లు అప్పీలు చేశారు. ఫీల్ అంపైర్ ఔట్ గా ప్రకటించాడు. నాన్ స్ట్రైకింగ్ లోని శ్రేయస్తో చర్చించకుండానే మ్యాక్స్వీ పెవిలియన్ ను వీడాడు. ఆ సమయంలో డగౌట్ లో ఉన్న కోచ్ రికీ పాంటింగ్ తీవ్ర అసహనం వ్యక్తంచేయడం గమనార్హం. రిప్లేలో మాత్రం బంతి వికెట్లను తాకలేదని తేలడంతో పంజాబ్ అభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు. మ్యాక్స్ వెల్ కనీసం డీఆర్ఎస్ తీసుకొని ఉంటే ఫలితం అనుకూలంగా వచ్చేదని.. చెత్త రికార్డును ఖాతాలో వేసుకోకుండా ఉండేవాడని పలువురు అభిప్రాయపడ్డారు.





IPL-2025

# రాజస్తాన్ కేకేఆర్ ఘన విజయం

గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్ లో 8 వికెట్ల తేడాతో కేకేఆర్ విజయం సాధించింది. 152 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్.. 18 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి చేధించింది. కోల్కతా విజయంలో క్వింటన్ డికాక్ కీలక పాత్ర పోషించాడు. ఓపెనర్ గా బరిలోకి దిగిన డికాక్ ఆఖరి వరకు క్రీజులో ఉండి మ్యాచ్ ను ముగించాడు. 61 బంతులు ఎదుర్కొన్న డికాక్.. 8ఫోర్లు, 5 సిక్సులతో 97 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. అతడితో పాటు రఘువంశీ(22), రహానే(18) పరుగులతో రాణించారు. రాజస్తాన్ బౌలర్లలో హసరంగా ఒక్కడే ఓ వికెట్ సాధించగా.. మరో వికెట్ రనౌట్ రూపంలో వచ్చింది.

## 17 ఓవర్లకే 90.. శ్రేయస్ సెంచరీ మిస్ అయ్యారే..

గుజరాత్ తో జరిగిన మ్యాచ్ లో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ సెంచరీ చేయలేకపోవడం ఆశ్చర్యమే. మూడో స్థానంలో దిగి మెరుపులు మెరిపించిన శ్రేయస్.. 16 ఓవర్ పూర్తయ్యేసరికి 66 పరుగులపై నిలిచాడు. ప్రసిద్ధ్ వేసిన తర్వాతి ఓవర్లో అతను చెలరేగిపోయాడు. వరుసగా 6, 4, 6, 6, 2 బాదేశాడు. దీంతో 90 పరుగులకు చేరుకున్నాడు. అప్పటికి ఇంకా 3 ఓవర్లు మిగిలి ఉన్నాయి. శ్రేయస్ సెంచరీ చేయడం లాంఛనమే అనిపించింది. కానీ తర్వాతి 2 ఓవర్లలో అతను మూడు బంతులే ఎదుర్కొని 7 పరుగులు సాధించాడు. ఎక్కువగా స్టైకింగ్ తనే తీసుకుని భారీ షాట్లు ఆడిన శశాంక్.. చివరి ఓవర్లో శ్రేయస్ కు ఒక్క బంతీ ఆడే అవకాశం ఇవ్వలేదు. అయిదు ఫోర్లు బాది మొత్తం 23 పరుగులు రాబట్టాడు. దీంతో శ్రేయస్ శతకానికి 3 పరుగుల దూరంలో నిలిచాడు. మ్యాచ్ అనంతరం శ్రేయస్ సెంచరీ మిస్ కావడంపై శశాంక్ స్పందించాడు.

''చివరి ఓవర్ తొలి బంతి నుంచి తన సెంచరీ గురించి ఆలోచించకుండా దూకుడుగా ఆడేయమని చెప్పాడు. ఆ మాటలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. బౌండరీలు బాదగలనని నాపై నమ్మకం ఉంది. ఈ స్థానంలో బ్యాటింగ్ చేస్తే హిట్టింగ్ చేయాల్సిందే. ఒక్కోసారి కనెక్ట్ కాదు. అయినా, నా బలం ఏంటో తెలుసు. దానిపై దృష్టిపెట్టా'' అని శశాంక్ వెల్లడించాడు.

## జపాన్‌లో బర్త్ డే సెలబ్రేషన్స్.. తారక్ పోస్ట్ చూశారా?

జూ.ఎన్టీఆర్ ప్రస్తుతం జపాన్ లో ఉన్నాడు. గతేడాది మన దగ్గర రిలీజైన దేవర.. ఈ 28న జపాన్ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఇదివరకే ప్రీమియర్స్ పడగా.. వాటికి తారక్ తోపాటు దర్శకుడు కొరటాల శివ కూడా హాజరవడం విశేషం. సతీసమేతంగా జపాన్ వెళ్లిన ఎన్టీఆర్.. తన భార్య ప్రణతి పుట్టినరోజు వేడుకల్ని మంగళవారం రాత్రి సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన రెండు ఫొటోలని షేర్ చేసుకోవడంతో పాటు క్యూట్ క్యాప్షన్ కూడా పెట్టాడు.

'అమ్మలు.. హ్యాపీ బర్త్ డే' అని తారక్ తన ఇన్ స్టాలో రాసుకొచ్చాడు. దీనికి నెటిజన్ల లైకులు కొట్టేస్తున్నారు. 2011లో తారక్-ప్రణతికి పెళ్లయింది. వీళ్లకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. సినిమాల విషయానికొస్తే జపాన్ నుంచి వచ్చిన వెంటనే ఎన్టీఆర్.. ప్రశాంత్ నీల్ తీస్తున్న సినిమా షూటింగ్ లో పాల్గొంటాడు. తర్వాత షెడ్యూల్ బెంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది.

# సంక్రాంతికి చిరు వస్తున్నాడోచ్

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఓ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఉగాది సందర్భంగా ఈ నెల 30న పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభం కానుంది. జూన్ నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలయ్యే అవకాశముంది. ఇది చాలా కాలం తర్వాత చిరు చేస్తున్న పూర్తి స్థాయి వినోదాత్మక సినిమా. యాక్షన్ తో పాటు కుటుంబ అంశాల మేళవింపుగా అందర్నీ అలరించే కథతో రూపొందనుంది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చిరుకు జోడీగా ఇద్దరు కథానాయికలు కనిపించే అవకాశముందని.. ఓ పాత్ర కోసం అదితీరావు హైదరి పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

## రజనీకాంత్, అమితాబ్ లతో నాకు పోటీ లేదు: మోహన్ లాల్

ప్రస్తుతం ఇండస్ట్రీ అంతా 'ఎల్2: ఎంపురాన్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మోహన్ లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ సినిమా మార్చి 27న ప్రేక్షకుల

ముందుకురానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మోహన్ లాల్ తనకు రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ లతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. వారితో తనకు పోటీ లేదన్నారు. ''నేను ట్రైలర్ ను రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ లకు పంపాను. వారు నిజంగా ప్రశంసించారు. రజనీకాంత్ ప్రత్యేకంగా ఫోన్ చేసి మాట్లాడారు. ట్రైలర్ లో లొకేషన్స్ బాగున్నాయని చెప్పారు. సినిమా కోసం మేం ఖర్చు చేసిందంతా లొకేషన్స్ లో కనిపిస్తుందని అభినందించారు. నటుడిగానే కాకుండా.. నిర్మాత కోణంలోనూ ఈ ట్రైలర్ ను చూశారు. అందుకే మా కష్టం ఆయనకు సులభంగా అర్థమైంది. ఆయన ఎప్పుడూ మనస్ఫూర్తిగా అభినందిస్తారు'' అని చెప్పారు.

# అందుకే రష్మిక చేయలేదు: శ్రీలీల

'రాబిన్‌హుడ్' లాంటి ఫన్ ఉన్న సినిమాని తన కెరీర్ లో ఇప్పటివరకూ చేయలేదని, ఇదొక ఫుల్ ఎంటర్ టైనర్ అని కథానాయిక శ్రీలీల అన్నారు. నితిన్ తో కలిసి ఆమె నటించిన చిత్రమిది. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శ్రీలీల పంచుకున్న ఆసక్తికర విషయాలు..

**అందుకే రష్మిక చేయలేదు**

''రాబిన్ హుడ్'లో నేను విదేశాల నుంచి ఇండియా వచ్చిన అమ్మాయిగా కనిపిస్తా. ఈ ప్రపంచమంతా తన చుట్టూనే ఉంటుందనే పాత్ర నాది. క్యారెక్టరైజేషన్ చాలా క్యూట్ గా ఉంటుంది. నిజానికి ఈ పాత్రను రష్మిక చేయాలి. ఆమెకు కూడా చాలా బాగా నచ్చింది. అయితే, డేట్స్ కుదరకపోవడం వల్ల చేయలేదు. 'పుష్ప2' షూటింగ్ లో కలిసినప్పుడు 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. నాకు కూడా చాలా నచ్చి చేశా''

**మా ట్రాక్ నవ్వులే నవ్వులు..**

''నితిన్ తో పనిచేయడం చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఆయన ఫ్యామిలీ పర్సన్ లా ఉంటారు. చాలా క్వాలిటీతో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. నితిన్ తో నాది హిట్ పెయిర్ అవుతుందని నమ్మకం. ఇక వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ గారితో ట్రాక్ షూట్ చేస్తున్నప్పుడే నవ్వాగలేదు. వెన్నెల కిషోర్ కామెడీని చాలా ఎంజాయ్ చేశా. మా ఇద్దరి మధ్య వచ్చే సీన్స్ మంచి వినోదాన్ని పంచుతాయి''

**చాలా మంచి కథలు వదులుకున్నా!**

''గతేడాది నేను చేసిన సినిమాలు వరుసగా విడుదలయ్యాయి. ఆ సినిమాల కోసం ఒక్కోరోజు నాలుగైదు షిఫ్టుల్లో పనిచేశా. అలా చేయడానికి కూడా కారణం ఉంది. అప్పుడు నేను మెడిసిన్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. సినిమాలు పూర్తి చేసి, చదువుపై దృష్టి పెట్టడానికే అలా చేయాల్సి వచ్చింది. ఏడాదిపాటు విరామం వస్తుందని నాకు తెలుసు. ఆ సమయంలో చాలా మంచి కథలు వదులుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు మెడిసిన్ పూర్తయింది. అయితే, కాలేజీలో కొన్ని రూల్స్ ఉంటాయి. దానికి తగ్గట్టుగా అటెండ్ అవుతున్నా''

**అలాంటి పాత్రలు చేస్తూనే ఉంటా!**

''ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో పాత్రలు గుర్తుపెట్టుకోవడం కాస్త కష్టమే. అయితే, 'భగవంత్ కేసరి'లో చేసిన విజ్జి పాప పాత్రను మర్చిపోను. దాని తర్వాత చాలా మంది అలా పిలవడం మొదలుపెట్టారు. అలా క్యారెక్టర్ పేరు గుర్తుపెట్టుకునే సినిమాలు చేయాలని ఉంది. కమర్షియల్ ఎంటర్ టైనర్ సినిమాలు చేస్తూనే మంచి మెసేజ్ ఉన్న పాత్రలు, సినిమాలు చేయాలన్నది నా ఆకాంక్ష. తెలుగు ఇండస్ట్రీ నా ఇల్లు. బాలీవుడ్కి వెళ్లిపోవడం ఎప్పటికీ జరగదు. ప్రస్తుతం 'పరాశక్తి' చేస్తున్నా. రవితేజతో 'మాస్ జాతర'లోనూ నటిస్తున్నా. కన్నడ-తెలుగులో 'జూనియర్' సినిమా చేస్తున్నా. ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి. త్వరలోనే అందుకు సంబంధించిన ప్రకటన వస్తుంది''.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.